thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు


Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 74 | జగిత్యాల | మంగళవారం | 9 జూన్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

## ఇన్నింగ్స్ తేడా భారత్ విజయం



11



## నీట్ రీ-ఎగ్జామ్‌కు కట్టుదిట్టమైన భద్రత

- పేపర్ తయారీ నుంచి పంపిణీ వరకు ప్రత్యేక నిఘా
- వాయుసేన సహాయంతో ప్రశ్నపత్రాల రవాణా
- జూన్ 21 వరకు రహస్య ప్రదేశంలో నిపుణులు

4

## మోడీ పాలనతో చిక్కుల్లో దేశం

- సర్ ప్రక్రియతో లక్షలాది మంది ఓట్లు గల్లంతు
- రాజకీయ వేధింపులకు దర్యాప్తు సంస్థల దుర్వినియోగం
- ఇండియాకూటమి భేటీలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే

4





## హోర్ముజ్ జలసంధి మూసివేత

- సంక్షోభం కొనసాగితే ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం
- దేశంలో 30 నుంచి 60 రోజులకు సరిపడా ఇంధన నిల్వలు
- కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్

వివరాలు 4వ పేజీలో



## రాబోయే 24 నెలలు అభివృద్ధికే!

దేశ ఆర్థిక వ్యవస్థకు ఆరు నగరాలే వెన్నెముక

### ఇతర నగరాల సమస్యలు ఇక్కడ రాకుండా ప్రణాళికలు

- సమన్వయం కోసమే మూడు కార్పొరేషన్లుగా విభజన
- గాజులరామారంలో వంద ఎకరాల్లో బస్ టెర్మినల్
- పేదల కోసం లక్ష ఇండ్ల నిర్మాణం..
- నిధులు తేని బీజేపీ ఎంపీలను నిలదీసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- మియాపూర్ 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' సభలో వెల్లడి



దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న ఆరు ప్రధాన మహానగరాల్లో హైదరాబాద్ ఒకటని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నగర అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు అమలు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ముందస్తు ప్రణాళికలతో హైద రాబాద్‌ను విశ్వనగరంగా తీర్చి దిద్దేందుకు చర్యలు చేపడుతు న్నట్లు ప్రకటించారు. సోమ వారం మియాపూర్‌లో నిర్వ హించిన ప్రజా పాలన బహిరం గ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు.

- ఉద్యమ కెరటం, హైదరాబాద్

వివరాలు 2వ పేజీలో

## బిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి

### దిగుమతులకు బ్రేక్!

- 80 రోజులకు సరిపడా నిల్వలు
- సంస్కరణలతో లక్షల మందికి ఉపాధి
- అర్జెంటీనాలో ఆరు 'క్రిటికల్ మినరల్స్' బ్లాకుల కొనుగోలు: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

2



దేశంలో బొగ్గు ఉత్పత్తి రికార్డు స్థాయికి చేరిందని, దిగుమతులను క్రమంగా తగ్గిస్తూ స్వయం సమృద్ధి సాధిస్తున్నామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటించారు. బొగ్గు రంగంలో తెచ్చిన సంస్కరణలతో ఐదు లక్షల మందికి ఉపాధి లభించిందని, భవిష్యత్తు అవసరాల కోసం 'క్రిటికల్ మినరల్స్'పై ప్రత్యేక దృష్టి సారించామని ఆయన స్పష్టం చేశారు.



## బడులను మూసే కుట్ర!

- 27 వేల పాఠశాలలను నాలుగు వేలకు కుదిస్తారా?
- ముఖ్యమంత్రి తీరుపై మండిపడ్డ కవిత

3

## పకడ్బందీగా ఓటర్ల జాబితా

- ఈ నెల 25 నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ
- సమస్యాత్మక ప్రాంతాల్లో పెట్రోలింగ్
- స్పష్టం చేసిన సీఈఓ సుదర్శన్ రెడ్డి

3



## ఎబోలాపై అప్రమత్తం!



- శంషాబాద్ విమానాశ్రయంలో పటిష్ట నిఘా
- గాంధీ ఆసుపత్రిలో ఇద్దరికి నెగిటివ్
- తప్పుడు అడ్రస్ ఇస్తే క్రిమినల్ కేసులు
- మంత్రి దామోదర్ రాజనర్సింహ

2



## హౌసింగ్ బోర్డులో భారీ భూదందా

- డిప్యూటీ కలెక్టర్‌ను సస్పెండ్ చేసిన సర్కారు
- అక్రమాలకు పాల్పడితే వదిలిపెట్టమన్న పొంగులేటి

2

## కొడుకు, కూతురికి మరణశిక్ష

### భార్యకు జీవిత ఖైదు

- పింఛన్ డబ్బుల కోసం విశ్రాంత ఉద్యోగిని ముక్కలుగా నరికిన కుటుంబ సభ్యులు
- మల్కాజిగిరి కోర్టు సంచలన తీర్పు

2



## నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేపమందు పంపిణీ

- ఏర్పాట్లను పరిశీలించిన సీపీ సజ్జన్నార్
- పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు

2

## మహిళా శక్తి ప్రదర్శన!

- నేడు పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ సదస్సు
- ముఖ్య అతిథిగా హాజరుకానున్న సీఎం రేవంత్ రెడ్డి
- ఆర్టీసీకి మహిళా సంఘాల 553 బస్సుల అప్పగింత

3





# కొడుకు, కూతురికి ఉరి

## భార్యకు జీవిత ఖైదు.. మల్కాజిగిరి కోర్టు సంచలన తీర్పు

## పింఛన్ డబ్బుల కోసం విశ్రాంత ఉద్యోగిని ముక్కలుగా నరికిన కుటుంబ సభ్యులు

**హైదరాబాద్, జూన్ 8 :** పింఛను డబ్బుల కోసం కట్టుకున్న భర్త, కన్న తండ్రి అని కూడా చూడకుండా ఓ విశ్రాంత రైల్వే ఉద్యోగిని అత్యంత కిరాతకంగా నరికి చంపిన కేసులో మల్కాజిగిరి కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ దారుణానికి పాల్పడిన మృతుడి భార్యకు జీవిత ఖైదు, కొడుకు, కూతురికి మరణశిక్ష (ఉరి) విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి తీర్పు చెప్పారు. నగరంలో 2019 ఆగస్టులో జరిగిన కిషన్ సుతార్ (70) హత్య కేసు అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. విశ్రాంత రైల్వే ఉద్యోగి అయిన కిషన్ సుతార్‌కు వచ్చే పింఛను డబ్బుల కోసం సొంత కుటుంబ సభ్యులే రాక్షసులుగా మారారు. భార్య గంగాబాయి, తన కొడుకు, కూతురుతో కలిసి పథకం ప్రకారం కిషన్ సుతార్‌ను దారుణంగా హత్య చేశారు. కేవలం చంపడంతోనే వారి కర్కశత్వం ఆగలేదు. హత్య అనంతరం ఆధారాలు మాయం చేసేందుకు మృతదేహాన్ని ముక్కలు ముక్కలుగా నరికారు. ఆ శరీర భాగాలను ఏకంగా ఆరు ప్లాస్టిక్ బకెట్లలో నిల్వ చేసి అత్యంత పాశవికంగా ప్రవర్తించారు. ఈ దారుణంపై సమాచారం అందుకున్న పోలీసులు.. అప్పట్లో ఘటనా స్థలానికి చేరుకుని భయానక దృశ్యాలను చూసి విస్తుపోయారు. పక్కా ఆధారాలతో నిందితులను అరెస్టు చేసి కటకటాల వెనక్కి నెట్టారు. దర్యాప్తును వేగవంతం చేసి కోర్టులో బలమైన ఆధారాలతో చార్జిషీటు దాఖలు చేశారు. పోలీసులు సేకరించిన శాస్త్రీయ ఆధారాలు, సాక్షుల విచారణతో నేరం సుస్పష్టంగా రుజువైంది. సుదీర్ఘ వాదనల అనంతరం సోమవారం మల్కాజిగిరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బాలభాస్కర్ రావు ఈ కేసులో తుది తీర్పును వెలువరించారు. కన్న తండ్రిని అత్యంత కిరాతకంగా ముక్కలుగా నరికిన కొడుకు, కూతురి అమానవీయ చర్యను అరుదైన కేసుగా పరిగణించిన కోర్టు.. వారిద్దరికీ ఉరిశిక్ష ఖరారు చేసింది. హత్యకు సహకరించిన మృతుడి భార్య గంగాబాయికి జీవిత ఖైదు విధించింది. డబ్బు కోసం కుటుంబ సభ్యులే ఇంతటి దారుణానికి ఒడిగట్టడం, దానికి కోర్టు కఠిన శిక్షలు విధించడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది.

# నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేపమందు పంపిణీ

## ఏర్పాట్లను పరిశీలించిన సిపి సజ్జన్నార్

## పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు

**హైదరాబాద్, జూన్ 8:** చేప మందు పంపిణీ సందర్భంగా నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో భద్రతా ఏర్పాట్లను హైదరాబాద్ సీపీ సజ్జనార్ పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్యూలైన్లు, కౌంటర్లు, మినీ కమాండ్ కంట్రోల్ సెంటర్ పని తీరును పరిశీలించారు. సీపీతో పాటు జాయింట్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్, గోల్కొండ డీసీపీ చంద్ర మోహన్ ఏర్పాట్లను పరిశీలించారు. ఇప్పటికే నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు చేప మందు భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. దీంతో నాంపల్లి మెట్రో పరిసర ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనాలు నెమ్మదిగా కదులుతున్న పరిస్థితి. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో భక్తుల కోసం చేప ప్రసాదం పంపిణీ సందర్భంగా వైద్య, అగ్నిమాపక శాఖలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. చేప ప్రసాదం కోసం వచ్చిన వారి కోసం 3 హెల్త్ క్యాంప్‌లను అందుబాటులో ఉంచారు. అత్యవసర పరిస్థితుల కోసం 5 అంబులెన్సులను సిద్ధం చేశారు. అస్వస్థతకు గురైన వారికి అక్కడికక్కడే ప్రాథమిక చికిత్స అందించనున్నారు. అవసరమైతే ఉస్మానియా ఆస్పత్రికి తరలింపుకు ఏర్పాట్లు చేశారు. వైద్య సిబ్బందితో హెల్త్ టీమ్ 24 గంటలూ అప్రమత్తంగా ఉండనుంది. భద్రతా చర్యల్లో భాగంగా 3 ÷ర్ ఇంజిన్లు అందుబాటులో ఉన్నాయి. భారీ జనసందోహం నేపథ్యంలో ప్రత్యేక అత్యవసర సేవలను ఏర్పాటు చేశారు. చేప ప్రసాదం కోసం వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సదుపాయాలను అధికారులు కల్పించారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేపమందు పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రభుత్వం తరఫున లక్షకు పైగా చేప పిల్లల ఏర్పాటు చేశారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. ఇప్పటికే దాదాపు 50 వేల మంది నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు చేరుకున్నారు. సాయంత్రం 7 గంటల నుంచే క్యూలైన్లలో ఉండనున్నారు. రాత్రి 9 గంటల 1 నిమిషానికి చేపమందు పంపిణీ ప్రారంభంకానుంది. శుభ ముహూర్తం ప్రకారమే చేపమందు పంపిణీని నిర్వాహకులు ప్రారంభించనున్నారు. ఉబ్బసం, ఆస్తమా బాధితులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. భద్రత, వైద్య సదుపాయాలు, తాగునీటి ఏర్పాట్లతో అధికారులు సిద్ధమయ్యారు. చేపమందు పంపిణీ నేపథ్యంలో నాంపల్లి పరిసరాల్లో ప్రత్యేకంగా ట్రాఫిక్ నిబంధనలు విధించారు. చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు చేసినట్లు సీపీ సజ్జనార్ తెలిపారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈ రోజు రాత్రి 9 గంటల నుంచి చేప ప్రసాదం పంపిణీ ప్రారంభం కానుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి సంబంధించి మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్ ఏర్పాట్లను పరిశీలించినట్లు తెలిపారు. ఇప్పటికే దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 25 వేల మంది హైదరాబాద్‌కు చేరుకున్నారని వెల్లడించారు. చేప ప్రసాదం పంపిణీ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వెయ్యి మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేసినట్లు సీపీ తెలిపారు. భద్రతా చర్యలను గోల్కొండ డీసీపీ చంద్ర మోహన్ పర్యవేక్షిస్తారని చెప్పారు. అలాగే ట్రాఫిక్ సమస్యలు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, నాంపల్లి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేస్తున్నామని వెల్లడించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఐదు అంబులెన్సులను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి వివిధ భాషల్లో సూచనలు, సమాచారాన్ని అందిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో నివసించే వారు రద్దీని దృష్టిలో ఉంచుకుని వీలైతే మంగళవారం వచ్చి చేప ప్రసాదం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అందరికీ సరిపడా చేప ప్రసాదం అందుబాటులో ఉందని, ఎలాంటి పుకార్లను నమ్మవద్దని సూచించారు. ఎన్జీవో సంస్థల వద్ద కూడా పోలీసు భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. షీ టీమ్స్, మఫ్టీ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. గతంలో జరిగిన కొన్ని ఆరోగ్య అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈసారి మరింత కట్టుదిట్టమైన భద్రత, వైద్య సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. రాత్రి వేళల్లో కార్యక్రమం జరుగనున్న నేపథ్యంలో భక్తులు పోలీసుల సూచనలు పాటించి సహకరించాలని సీపీ సజ్జనార్ కోరారు.

# రాబోయే 24 నెలలు అభివృద్ధికే!

- దేశ ఆర్థిక వ్యవస్థకు ఆరు నగరాలే వెన్నెముక
- సమస్యలు ఇక్కడ రాకుండా ప్రణాళికలు
- సమన్వయం కోసమే 3 కార్పొరేషన్లు
- గాజులరామారంలో బస్ టెర్మినల్
- పేదల కోసం లక్ష ఇండ్ల నిర్మాణం..
- నిధులు తేని బీజేపీ ఎంపీలను నిలదీసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- మియాపూర్ ప్రజా పాలన సభలో వెల్లడి



**ఉద్యమ కెరటం, హైదరాబాద్:** దేశంలోని ఢిల్లీ, ముంబై, బెంగళూరు, కలకత్తా, చెన్నై, హైదరాబాద్ నగరాలే దేశ ఆర్థిక వ్యవస్థను నడిపిస్తున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఢిల్లీలో కాలుష్యం, ముంబైలో ముంపు, బెంగళూరు, చెన్నై, కలకత్తాల్లో ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, అలాంటి పరిస్థితులు హైదరాబాద్‌లో తలెత్తకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. మహానగరం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాల కోసమే నగరాన్ని మూడు కార్పొరేషన్లుగా విభజించామన్నారు. మున్సిపల్, పోలీసు శాఖల మధ్య సమన్వయం మెరుగుపడేలా పరిపాలనా సరిహద్దులను నిర్ణయించామని వివరించారు. జెండాలు, ఎజెండాలకు అతీతంగా నగరాభివృద్ధికి అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. పేద పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచి ఇంటర్మీడియట్ వరకు అల్పాహారం అందిస్తున్నామన్నారు. నగరంలో లక్ష ఎల్ఐజీ, ఎంఐజీ ఇండ్ల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించామని, ప్రజలు నివసిస్తున్న ప్రాంతాలకే సమీపంలో వీటిని నిర్మించి ఇస్తామన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి విడిపించి పేదల గృహ నిర్మాణానికి వినియోగిస్తామని స్పష్టం చేశారు. ఉచిత బస్సు ప్రయాణంతో పాటు ఇందిరా మహిళా శక్తి ద్వారా మహిళలకు 150 వాణిజ్య స్టాల్స్ కేటాయించామని, వారిని పెట్రోల్ బంకుల యజమానులుగా తీర్చిదిద్దుతున్నామని వివరించారు. హైదరాబాద్‌కు తగిన మౌలిక వసతులు కల్పించే క్రమంలో మెట్రో రెండో దశ పనులు చేపడుతున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. గాజులరామారంలో సుమారు వంద ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ స్థాయి బస్ టెర్మినల్ నిర్మించనున్నట్లు ప్రకటించారు. కేవలం మూడు నెలల్లోనే ఈ ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తామన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రం నుంచి నిధులు తీసుకురావడంలో బీజేపీ ఎంపీలు ఎందుకు చొరవ చూపడం లేదని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నిధుల సాధనలో ముందుండాలని సూచించారు. గుజరాత్‌లో సబర్మతి నది అభివృద్ధిని ప్రశంసించే వాళ్లు.. తెలంగాణలో మూసీ నది అభివృద్ధిని ఎందుకు వ్యతిరేకిస్తున్నారని నిలదీశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలన, కేంద్రంలోని పన్నెండేళ్ల బీజేపీ పాలన, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ ముప్పై నెలల పనితీరుపై బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. ఎవరు రాష్ట్రానికి ఎంత అభివృద్ధి చేశారో, ఎన్ని నిధులు తెచ్చారో ప్రజల ముందే తేల్చుకుందామన్నారు. రాబోయే 24 నెలలు పూర్తిగా అభివృద్ధి కార్యక్రమాలకే అంకితం చేస్తామని స్పష్టం చేశారు. ఈ సభలో రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు మల్రెడ్డి రంగారెడ్డి, అరికెపూడి గాంధీ, ప్రభుత్వ సలహాదారులు, కార్పొరేషన్ చైర్మన్లు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# బిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి

- దిగుమతులకు బ్రేక్!
- 80 రోజులకు సరిపడా 189 మిలియన్ టన్నుల నిల్వలు
- కోల్ రంగంలో సంస్కరణలతో ఐదు లక్షల మందికి ఉపాధి
- అర్జెంటీనాలో ఆరు 'క్రిటికల్ మినరల్స్' బ్లాకుల కొనుగోలు
- వెల్లడించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి




**హైదరాబాద్, జూన్ 8:** కేంద్ర ప్రభుత్వం బొగ్గు ఉత్పత్తిలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకురావడంతో దేశం స్వయం సమృద్ధి దిశగా అడుగులేస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. విదేశాల నుంచి బొగ్గు దిగుమతులను క్రమంగా తగ్గిస్తున్నామన్నారు. నూతన భారత నిర్మాణంలో కోల్, మైనింగ్ రంగాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని వెల్లడించారు. ప్రస్తుతం దేశంలో 80 రోజులకు సరిపడా 189 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు అందుబాటులో ఉన్నాయని కిషన్ రెడ్డి తెలిపారు. దేశ విద్యుత్ ఉత్పత్తిలో 72 శాతం బొగ్గుపైనే ఆధారపడి ఉందన్న ఆయన.. బొగ్గు వినియోగంలో చైనా తర్వాత భారత్ రెండో స్థానంలో ఉందన్నారు. ఈ ఏడాది ఒక బిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి మైలురాయిని దేశం చేరుకుందని వివరించారు. కాంగ్రెస్ హయాంలో లక్షల కోట్ల బొగ్గు కుంభకోణాలు జరగ్గా.. తమ ప్రభుత్వం పారదర్శక విధానాలతో ఈ రంగంలో ఏకంగా ఐదు లక్షల మందికి ఉపాధి కల్పించిందన్నారు. అండర్ గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్ పై అధ్యయనం చేస్తున్నామని, వాడకం పూర్తయిన గనులను శాస్త్రీయంగా మూసివేస్తూ.. ఆ విధానంలో గిన్నిస్ బుక్ రికార్డు కోసం ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు.

### క్రిటికల్ మినరల్స్ పై గురి..

క్రిటికల్ మినరల్స్ కోసం ప్రపంచవ్యాప్తంగా తీవ్ర పోటీ నెలకొందని, దేశాధినేతలను కిడ్నాప్ చేసే స్థాయికి పరిస్థితులు వెళ్లాయని కిషన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఆపరేషన్ సింధూర్ తర్వాత భారత్‌కు ఓ పొరుగు దేశం కీలక ఖనిజాల సరఫరాను నిలిపివేసిందన్నారు. ఈ నేపథ్యంలో 'క్రిటికల్ మినరల్స్ మిషన్' కింద రూ. 1,500 కోట్లు కేటాయించామని, ఇప్పటికే అర్జెంటీనాలో ఆరు బ్లాకులను తీసుకున్నామని వివరించారు. మరోవైపు, డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ (డీఎంఎఫ్) నిధులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని, బాధిత జిల్లాలకు ఆ నిధులను ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. ఇక సింగరేణి కాలరీస్ వ్యవహారాలు పూర్తిగా రాష్ట్ర సర్కారు ఆధీనంలోనే ఉంటాయని, కార్మికులకు మెరుగైన ఆర్థిక భద్రత కల్పించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని ఆయన తేల్చి చెప్పారు.

# ఎబోలాపై సర్కారు అప్రమత్తం!

- శంషాబాద్ విమానాశ్రయంలో పటిష్ట నిఘా
- గాంధీ ఆసుపత్రిలో ఇద్దరికి నెగిటివ్
- తప్పుడు అడ్రస్ ఇస్తే క్రిమినల్ కేసులు
- ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



**హైదరాబాద్, జూన్ 8:** ఎబోలా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రభావిత దేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై శంషాబాద్ విమానాశ్రయంలో పటిష్ట నిఘా పెట్టింది. తప్పుడు వివరాలు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రయాణికులతో మాట్లాడేందుకు ప్రత్యేకంగా అనువాదకులను నియమిస్తున్నట్లు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు. డెమోక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాల్లో ఎబోలా వ్యాప్తి నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సోమవారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రభావిత దేశాల నుంచి వచ్చే ప్రయాణికుల వివరాలు సేకరించి, వారి ఆరోగ్యాన్ని 21 రోజుల పాటు నిరంతరం పర్యవేక్షిస్తున్నామని అధికారులు మంత్రికి వివరించారు. అనుమానితులను వెంటనే గుర్తించి గాంధీ ఆసుపత్రిలో ఐసోలేషన్ లో ఉంచుతున్నట్లు తెలిపారు. ఇప్పటివరకూ ఇద్దరు అనుమానితుల శాంపిల్స్ ను పుణెలోని ఎన్ఐవీకి పంపగా నెగిటివ్ వచ్చిందని అధికారులు తెలిపారు. ఐసీఎంఆర్ సూచనలతో రెండోసారి కూడా శాంపిల్స్ పంపామని, మళ్లీ నెగిటివ్ వస్తే డిశ్చార్జి చేస్తామన్నారు. ఈ ప్రక్రియలో ఎలాంటి అలసత్వం వద్దని మంత్రి సూచించారు. ఐసీఎంఆర్ నుంచి ఎబోలా కిట్లు వచ్చాయని, శాంపిల్ రాగానే పరీక్షలు చేసి నివేదిక ఇస్తామని సీసీఎంబీ డైరెక్టర్ వినయ్ నందికూరి తెలిపారు. రాష్ట్రంలో ఎబోలా నివారణకు అన్ని ఏర్పాట్లు ఉన్నాయని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని మంత్రి భరోసా ఇచ్చారు. విదేశాల నుంచి వచ్చే కొందరు ప్రయాణికులు తప్పుడు అడ్రస్ ఇస్తున్నారని అధికారులు తెలపడంపై మంత్రి తీవ్రంగా స్పందించారు. వాస్తవాలు దాచిపెడితే ఎపిడెమిక్ డిసీజెస్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ విషయాన్ని ఎయిర్ పోర్టులోనే ప్రయాణికులకు స్పష్టంగా చెప్పాలన్నారు. ప్రయాణికులతో మాట్లాడేందుకు ఈఎఫ్ఎల్యూ సహకారం తీసుకోవాలని, ఫ్రెంచ్, అరబిక్, స్వాహిలి భాషలు మాట్లాడే సిబ్బందిని ఎయిర్ పోర్టులో మూడు షిఫ్టుల్లో అందుబాటులో ఉంచాలని సూచించారు. కాంటాక్ట్ ట్రేసింగ్ కోసం ఆరోగ్య శాఖ, జీహెచ్ఎంసీ, పోలీసుల మధ్య సమన్వయం పెరగాలన్నారు. ఈ సమీక్షలో ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు, జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ సంతోష్, డీసీపీ శిల్పవల్లి, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# భద్రతలో రాజీ లేదు!

## ఫుడ్ పాయిజన్‌కు ఏమాత్రం తావుండొద్దు

## ప్రవేశాల్లో పూర్తి పారదర్శకత పాటించాలి

## స్పష్టం చేసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**హైదరాబాద్, జూన్ 8:** గురుకులాల్లో విద్యార్థుల భద్రత, నాణ్యమైన విద్య, పౌష్టికాహారం విషయంలో ఎలాంటి రాజీ పడబోమని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. ఫుడ్ పాయిజన్ ఘటనలకు ఏమాత్రం తావులేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సచివాలయం నుంచి సోమవారం గురుకుల విద్యాలయాల సంస్థ సిబ్బంది, అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురుకులాలు దళిత, గిరిజన, పేద విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే జ్ఞాన కేంద్రాలన్నారు. వంట సరుకుల కొనుగోలు నుంచి నిల్వ, పంపిణీ వరకు ప్రతి దశలో అత్యంత అప్రమత్తంగా ఉంటూ నాణ్యత పాటించాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థిని సిబ్బంది తమ సొంత పిల్లల్లా చూసుకోవాలని మంత్రి సూచించారు. జేఈఈ, నీట్, క్లాట్, సీయూఈటీ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అడ్మిషన్ల ప్రక్రియలో అక్రమాలకు తావులేకుండా పూర్తి పారదర్శకత పాటించాలని హెచ్చరించారు. వర్షాకాలం నేపథ్యంలో పాఠశాలలు, హాస్టళ్లలో పైకప్పుల లీకేజీలు, విద్యుత్, మరుగుదొడ్ల మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలన్నారు. సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి విజయేంద్ర బోయి, గురుకులాల సంస్థ కార్యదర్శి కంభంపాటి శారద, అధికారులు డాక్టర్ శ్రీనివాసులు, చిన్న సైలు, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పెళ్లికి ముందు బంధం తప్పుకాదు!

**ఇష్టపూర్వకంగా సంబంధం పెట్టుకుంటే నేరం కాదు**

**క్యారెక్టర్‌ను తప్పుబట్టలేమన్న సుప్రీంకోర్టు**

**ప్రతి ప్రేమకథ పెళ్లితో ముగియాలన్న రూల్ లేదు**

**కానిస్టేబుల్ అభ్యర్థి ఉద్యోగం రద్దు చెల్లదు**

**తెలంగాణ యువకుడికి అనుకూలంగా తీర్పు**

**న్యూఢిల్లీ, జూన్ 8:** ఇద్దరు మేజర్లు ఇష్టపూర్వకంగా పెళ్లికి ముందే శారీరక సంబంధం పెట్టుకుంటే.. దాని ఆధారంగా వారి ప్రవర్తన, క్యారెక్టర్‌ను తప్పుబట్టలేమని సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. ప్రేమ విఫలమైనంత మాత్రాన మోసం చేసినట్లు కాదని స్పష్టం చేస్తూ.. పాత కేసు కారణంగా కానిస్టేబుల్ ఉద్యోగం కోల్పోయిన తెలంగాణ యువకుడికి పెద్ద ఊరటనిచ్చింది. తెలంగాణకు చెందిన గాజుల తిరుపతి కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. అయితే పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడంటూ 2014లో అతనిపై ఓ యువతి కేసు పెట్టింది. ఆ తర్వాత 2015లో లోక్ అదాలత్ ద్వారా ఇరువర్గాలు రాజీ పడ్డాయి. అయితే ఈ కేసును సాకుగా చూపి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ అతని ఉద్యోగాన్ని రద్దు చేసింది. దీనిపై సదరు అభ్యర్థి సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఈ కేసును విచారించిన జస్టిస్ మన్మోహన్, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం పోలీసు బోర్డు నిర్ణయాన్ని తప్పుబట్టింది. మారుతున్న సామాజిక పరిస్థితుల్లో పెళ్లికి ముందే ప్రేమించుకోవడం, శారీరక సంబంధాలు కలిగి ఉండటం సాధారణంగా మారిందని వ్యాఖ్యానించింది. ఇష్టపూర్వకంగా కలిసి ఉండి ఆ తర్వాత పెళ్లి చేసుకోలేదన్న ఒకే ఒక్క కారణంతో మోసం చేశారని అనుకోలేమని స్పష్టం చేసింది. ప్రతి ప్రేమకథా పెళ్లితోనే ముగియాలని నియమం ఏమీ లేదని పేర్కొంది. లోక్ అదాలత్‌లో రాజీపడినంత మాత్రాన సదరు అభ్యర్థి తప్పు ఒప్పుకున్నట్లు కాదని న్యాయమూర్తులు తేల్చిచెప్పారు. బాధితురాలే స్వయంగా కేసును వెనక్కి తీసుకున్నప్పుడు.. అభ్యర్థి క్యారెక్టర్ బాలేదంటూ ఉద్యోగానికి అనర్హుడిని చేసే హక్కు పోలీసు



బోర్డుకు లేదన్నారు. కేవలం విఫలమైన ప్రేమ బంధాన్ని సాకుగా చూపి ఉద్యోగం నిరాకరించడం అన్యాయమని పేర్కొన్నారు. పోలీసు బోర్డు రద్దు ఉత్తర్వులను కొట్టివేస్తూ.. తిరుపతిని వెంటనే విధుల్లోకి తీసుకుని తదుపరి బ్యాచ్ కానిస్టేబుళ్లతో పాటు శిక్షణకు పంపాలని ధర్మాసనం ఆదేశించింది.

# హౌజింగ్ బోర్డులో భారీ భూదందా



- డిప్యూటీ కలెక్టర్ రామునాయక్‌ను సస్పెండ్ చేసిన సర్కారు
- సహకరించిన సూపరింటెండెంట్ శాశ్వత తొలగింపు
- అక్రమాలకు పాల్పడితే ఎవరినీ వదిలిపెట్టమన్న మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, జూన్ 8 :** రెవెన్యూ శాఖలో డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్న రాము నాయక్‌పై రాష్ట్ర ప్రభుత్వం వేటు వేసింది. హౌజింగ్ బోర్డు స్థలాల వ్యవహారంలో భారీగా భూ దందాలు, అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో ఆయనను సస్పెండ్ చేస్తున్నట్లు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. బహిరంగ మార్కెట్లో గజం రెండు లక్షల రూపాయలకు పైగా విలువ చేసే హైకోర్టు పరిసరాల్లోని హౌజింగ్ బోర్డుకు చెందిన 33.53 గజాల స్థలాన్ని రాము నాయక్ 2018 ఫిబ్రవరి 17న అక్రమంగా వేరొకరి పేరిట రిజిస్ట్రేషన్ చేసినట్లు అధికారులు తేల్చారు. పేదల ఇందిరమ్మ ఇళ్ల స్థలాల పరిశీలనలో ఈ దందాలు వెలుగుచూశాయి. తాజా విచారణలో విజయనగర్ కాలనీ, తుల్జాగూడ, లక్ష్మీగూడ, మహబూబ్ గంజ్ తదితర ప్రాంతాల్లోనూ అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగినట్లు బయటపడింది. ఇందులో సబ్ రిజిస్ట్రార్ల పాత్రపైనా విచారణ సాగుతోంది. ఈ అక్రమ సేల్ డీడ్లను వెంటనే రద్దు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

**సహకరించిన వారిపైనా చర్యలు..**

రామునాయక్ భూ దందాలకు సహకరించిన ఓ సూపరింటెండెంట్‌ను రెవెన్యూ శాఖ శాశ్వతంగా తొలగించింది. మరో సూపరింటెండెంట్ బోనానాయక్ ను సస్పెండ్ చేసింది. రామునాయక్‌పై 2016 నుంచే వివిధ కేసులు ఉన్నట్లు విచారణలో తేలింది. ప్రభుత్వ ఆస్తులను దోచుకునేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మంత్రి పొంగులేటి హెచ్చరించారు. భూకబ్జాలపై అధికారులు ప్రత్యేక నిఘా పెట్టడంతో.. తీగ లాగితే డొంక కదిలినట్లు అక్రమాలన్నీ ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి.

# నిబంధనలు మీరితే సీజ్!

**బడుల బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి**

**తనిఖీల కోసం 12 ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు: మంత్రి పొన్నం**

**హైదరాబాద్:** రవాణా శాఖలో నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై ఉక్కుపాదం మోపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పన్నులు చెల్లించని, ఫిట్ నెస్ లేని, ఓవర్ లోడింగ్ తో తిరిగే వాహనాలను తక్షణమే సీజ్ చేయాలని అధికారులకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కఠిన ఆదేశాలు జారీ చేశారు. సచివాలయంలో రవాణా శాఖ అధికారులతో సోమవారం మంత్రి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెక్ పోస్టులు రద్దు చేసిన నేపథ్యంలో ఎన్ ఫోర్స్ మెంట్ ను మరింత బలోపేతం చేయాలన్నారు. ఉమ్మడి జిల్లాల వారీగా 10, రాష్ట్ర స్థాయిలో 2 ప్రత్యేక స్క్వాడ్లతో తనిఖీలు ముమ్మరం చేయాలని సూచించారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వాహనాలు పన్నులు చెల్లించకుండా రాష్ట్రంలో తిరిగితే భారీ జరిమానాలు విధించడంతో పాటు సీజ్ చేయాలన్నారు. స్లీపర్ బస్సుల్లో నిబంధనల ఉల్లంఘనలను ఏమాత్రం ఉపేక్షించవద్దని అధికారులను ఆదేశించారు. విద్యార్థులను తరలించే స్కూల్ బస్సులు, మినీ వ్యాన్లకు ఫిట్ నెస్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తే వాహనాలను సీజ్ చేయాలని, ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రవాణా వ్యవస్థలో క్రమశిక్షణ, ప్రజల ప్రాణ భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, అడిషనల్ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ రమేష్, జేటీసీ చంద్రశేఖర్ గౌడ్, డీటీసీలు రవీందర్ కుమార్, వెంకట రమణ, సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**బీసీ గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి**

సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ను బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య, ఇతర నేతలు కలిశారు. బీసీల సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రంలో బీసీ గురుకులాలు, హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు. పెండింగ్ ఫీజుల బకాయిలు చెల్లించాలని, బీసీ రిజర్వేషన్ల రోస్టర్ విధానం సవరించాలని విజ్ఞప్తి చేశారు. విదేశీ విద్యా నిధి సంఖ్య పెంచడంతో పాటు బీసీ సంక్షేమ శాఖలో బీసీ ఉద్యోగులే ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్, కార్యదర్శి పృథ్వీ గౌడ్, నేతలు బలరాం, సాయి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఫెర్టిలైజర్ యాప్ భేష్!

**దేశవ్యాప్తంగా తెలంగాణ నమూనాపై ప్రశంసలు**

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**హైదరాబాద్, జూన్ 8 :** రైతులకు పారదర్శకంగా ఎరువులు పంపిణీ చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన ఫెర్టిలైజర్ యాప్‌నకు దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుతున్నాయి. పొరుగు రాష్ట్రాలు కూడా ఈ నమూనాను ఆదర్శంగా తీసుకుంటున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఎరువుల పంపిణీలో సాంకేతిక వినియోగాన్ని మరింత విస్తరిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ ఫెర్టిలైజర్ యాప్ పనితీరును కేంద్ర వ్యవసాయ శాఖ కూడా అభినందించిందని మంత్రి తుమ్మల తెలిపారు. దేశవ్యాప్తంగా ఈ యాప్ అమలుకు కేంద్రం సన్నాహాలు చేస్తోందని వివరించారు. ఎరువుల కోసం రైతులు క్యూ లైన్లలో నిలబడే తిప్పలు తప్పించేందుకు యాప్‌లో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇకపై మీసేవ కేంద్రాల ద్వారా, టెలిఫోన్ ద్వారా కూడా ఎరువులు బుకింగ్ చేసుకునే సదుపాయం తెస్తున్నామన్నారు. రైతుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశామని, డీలర్ల వద్ద ఉన్న స్టాక్ వివరాలను మొబైల్‌లోనే తెలుసుకునే వీలుంటుందని పేర్కొన్నారు.

**నోడల్ అధికారుల నియామకం..**

రాష్ట్రంలో ఖరీఫ్ అవసరాల కోసం 6 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించాలని కేంద్రాన్ని కోరినట్లు మంత్రి తుమ్మల చెప్పారు. యూరియా సరఫరా కోసం కేంద్రంతో నిరంతరం సమన్వయం చేసుకునేందుకు ఢిల్లీలో ఒక ప్రత్యేక నోడల్ అధికారిని నియమించామన్నారు. కాకినాడ పోర్టు నుంచి యూరియాను వేగంగా తరలించేందుకు మరో ప్రత్యేక అధికారిని ఏర్పాటు చేసినట్లు వివరించారు. రైతు సంక్షేమ కార్యక్రమాలపై ప్రతిపక్షాలు రాజకీయం చేయవద్దని హితవు పలికారు. ఈ మేరకు ఆదివారం మంత్రి కార్యాలయం ఒక ప్రెస్ నోట్ విడుదల చేసింది.



# మూడు రోజుల్లో రుతుపవనాలు!

**ఆశాజనకంగా నైరుతి విస్తరణ**

**పడిపోయిన పగటి ఉష్ణోగ్రతలు**

**నాలుగు రోజులు భారీ వర్షాలు**

**హైదరాబాద్ కు ఎల్లో అలర్ట్**

**వెల్లడించిన వాతావరణ కేంద్రం**



**హైదరాబాద్, జూన్ 8 :** రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు మరో రెండు, మూడు రోజుల్లో ప్రవేశించనున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ప్రస్తుతం ఇవి ఆశాజనకంగా ముందుకు విస్తరిస్తుండటంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. వచ్చే నాలుగు రోజుల పాటు రాష్ట్రంలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వికారాబాద్, సంగారెడ్డి, నారాయణపేట, మహబూబ్‌నగర్, గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, నల్గొండ, రంగారెడ్డి జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే వర్షాలు ప్రారంభమయ్యాయి. హైదరాబాద్ నగరంలో సాయంత్రం నుంచి రాత్రి వరకు పశ్చిమ, దక్షిణ ప్రాంతాల్లో ఒక మోస్తరు వర్షం కురిసే వీలుంది. ఈ నెల 10వ తేదీ వరకు నగరానికి ఎల్లో అలర్ట్ జారీ చేశారు. నాలుగు రోజుల పాటు భారీ వర్షాలతో పాటు గంటకు 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. గడిచిన 24 గంటల్లో వనపర్తి, వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిశాయి. వనపర్తి జిల్లా ఏదుల మండలంలో అత్యధికంగా 5.08 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వికారాబాద్ జిల్లా తాండూరులో 4.73 సెంటీమీటర్లు, చాదన్‌పూర్‌లో 3.58, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా బాచుపల్లిలో 4.06, రంగారెడ్డి జిల్లా మాడ్గులలో 4.44 సెంటీమీటర్ల వర్షం పడింది. వనపర్తి జిల్లా రేవల్లిలో 3.38, పంగల్‌లో 2.72, జోగులాంబ గద్వాల జిల్లా ఆలంపూర్‌లో 2.56, యాదాద్రి భువనగిరి జిల్లాలో 2.48 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం రికార్డయ్యింది.

# మహిళా శక్తి ప్రదర్శన!

**నేడు పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ సదస్సు**

**ముఖ్య అతిథిగా హాజరుకానున్న సీఎం రేవంత్ రెడ్డి**

**ఆర్టీసీకి మహిళా సంఘాల 553 బస్సుల అప్పగింత**



**హైదరాబాద్, జూన్ 8:** రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక సాధికారత, ఉపాధి విస్తరణ, వ్యాపారాభివృద్ధే లక్ష్యంగా నేడు (మంగళవారం) సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో 'మహిళా శక్తి మహాసభ' జరగనుంది. మంగళవారం సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు 25 వేల మంది మహిళలు ఈ సభకు హాజరవుతారని అంచనా. మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను సీఎం రేవంత్ రెడ్డి ఈ సభలో వివరించనున్నారు. ప్రస్తుతం మహిళా సంఘాలకు అందుతున్న రూ. 5 లక్షల రుణ పరిమితిని రూ. 10 లక్షలకు పెంచుతూ ఈ వేదికపైనే కీలక ప్రకటన చేసే అవకాశం ఉంది. ఈ సందర్భంగా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల కింద రూ. 500 కోట్ల చెక్కులు పంపిణీ చేయనున్నారు. అలాగే, మహిళా సంఘాల భాగస్వామ్యంతో కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకు ఇచ్చిన 553 బస్సులను ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించనున్నారు.

**కొత్త బస్సుల కోసం ఆర్టీసీకి నిధులు..**

కొత్త బస్సుల కొనుగోలు కోసం టీజీఎస్‌ఆర్టీసీకి రూ. 199 కోట్ల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందించనుంది. అలాగే, మహిళా సంఘాలు అద్దెకు ఇచ్చిన బస్సుల అద్దె కింద ఆర్టీసీకి రూ. 20.30 కోట్ల చెక్కులను పంపిణీ చేయనున్నారు. మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా మహిళలకు ఇప్పటివరకు కలిగిన రూ. 10,700 కోట్లకు పైగా ఆర్థిక ప్రయోజనాలను కూడా సభలో వివరిస్తారు. సభ ఏర్పాట్లను మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించే భాగస్వాములుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని వారు పేర్కొన్నారు. మహిళలంతా తరలివచ్చి సదస్సును విజయవంతం చేయాలని మంత్రులు పిలుపునిచ్చారు. సోమవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కూడా ఉన్నతాధికారులతో సమీక్షించి ఏర్పాట్లను పరిశీలించారు.

# బడులను మూసే కుట్ర!

**27 వేల పాఠశాలలను నాలుగు వేలకు కుదిస్తారా?**

**ముఖ్యమంత్రి తీరుపై మండిపడ్డ కవిత**



**హైదరాబాద్, జూన్ 8 :** రాష్ట్రంలో సమీకృత పాఠశాలల పేరుతో 27 వేల ప్రభుత్వ బడులను నాలుగు వేలకు కుదించాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయంపై బీఆర్ఎస్ నేత కవిత తీవ్రంగా మండిపడ్డారు. ఇది పేద విద్యార్థులను, ముఖ్యంగా బాలికలను విద్యకు దూరం చేసే దారుణమైన కుట్ర అని ఆమె విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలను కుదించాలన్న నిర్ణయాన్ని తప్పుబడుతూ కవిత సోమవారం ఒక వీడియో విడుదల చేశారు. రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో వంద మందికి పైగా విద్యార్థులు ప్రాణాలు కోల్పోయినా ముఖ్యమంత్రి కనీసం సమీక్ష కూడా నిర్వహించలేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు ఏకంగా పాఠశాలలను మూసివేస్తున్నట్లు ప్రకటించడాన్ని చూస్తే విద్యాశాఖపై ప్రభుత్వానికి ఏమాత్రం పట్టులేదని స్పష్టమవుతోందని విమర్శించారు. బెంగళూరులో జరిగిన ఒక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీకృత పాఠశాలలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలోని 27 వేల ప్రభుత్వ బడుల్లో 18 లక్షల మంది విద్యార్థులుండగా.. 12 వేల ప్రైవేట్ బడుల్లో 35 లక్షల మంది చదువుతున్నారని ఆయన తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకేచోట విద్య, ఉచిత రవాణా, భోజన వసతులతో కూడిన 'సమీకృత పాఠశాలలను' ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు ఆయన ఆ సభలో వెల్లడించారు.

# పకడ్బందీగా ఓటర్ల జాబితా

**ఈ నెల 25 నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ**

**సమస్యాత్మక ప్రాంతాల్లో పెట్రోలింగ్**

**స్పష్టం చేసిన సీఈఓ సుదర్శన్ రెడ్డి**

**హైదరాబాద్, జూన్ 8:** ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ముందుగానే పెట్రోలింగ్ నిర్వహించి.. క్షేత్ర స్థాయిలో పనిచేసే సిబ్బందికి తగిన భద్రత, సహకారం అందించాలని పోలీసులకు సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేసేందుకు బీఎల్వోలు, సూపర్ వైజర్లకు భద్రత కల్పించే అంశంపై మంగళవారం సీఈఓ సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు సీఈఓ వసంత్ వెంకటేశ్వర్ రెడ్డి, హైదరాబాద్ సౌత్ రేంజ్ అదనపు పోలీసు కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్ పాల్గొన్నారు. రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియ ఈ నెల 25 నుంచి ప్రారంభం కానుందని సుదర్శన్ రెడ్డి తెలిపారు. బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఫారాలు పంపిణీ చేసి, తిరిగి స్వీకరించాలని సూచించారు. విధులు నిర్వహించే సిబ్బంది పేర్లు, ఫోన్ నంబర్లను స్థానిక పోలీసులకు ఇవ్వాలని, అలాగే పోలీసు అధికారుల నంబర్లను ఎన్నికల అధికారులు తీసుకోవాలని సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందుగానే పోలీసులతో సమన్వయ సమావేశాలు నిర్వహించుకోవాలని డీఈవోలకు సూచించారు. సిబ్బందికి అవసరమైన భద్రత, పూర్తి సహకారం అందిస్తామని తఫ్సీర్ ఇక్బాల్ హామీ ఇచ్చారు. ఈ సమీక్షలో కలెక్టర్లు, జీహెచ్ఎంసీ కమిషనర్, పోలీసు కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.





## తెలుగు రాష్ట్రాల్లో చాపకింద నీరులా

# డ్రగ్స్ సరఫరా

**ఆందోళనలో తల్లిదండ్రులు**

**విద్యార్థులే లక్ష్యంగా అంతర్జాతీయ ముఠాల వ్యాపారం**

**గల్ఫ్ దేశాల్లోని జైళ్లలో మగ్గుతున్న ఏపీ ప్రవాసులు..**

**దర్యాప్తునకు సహకరించని కుటుంబాలు**

**సీసీ కెమెరాల ఏర్పాటుతోనే యువతకు రక్షణ**

ఇటీవలి కాలంలో మాదక ద్రవ్యాల పట్టివేత ఆందోళన కలిగిస్తోంది. ఎక్కడికక్క నిత్యం ఎక్కో ఓ చోట మాదక ద్రవ్యాలు పట్టుబడుతూనే ఉన్నాయి. ఉమమడి తెలుగు రాష్ట్రాల్లో గంజాయి విపరీతంగా సరఫరా అవుతోంది. ఈగిల్ టీమ్‌లు పనిచేస్తున్నా, డ్రగ్స్ సరఫరా ఆగడం లేదు. చాపకింద నీరులా డ్రగ్స్ రవాణా సాగుతుతోంది. కాలేజీలు, స్కూళ్లు తెరు-స్తున్న వేళ ప్రభుత్వాలు అప్రమత్తం కావాలి. మాదక ద్రవ్యాలు చిన్నారులను చిదిమేయకుండా చూడాలి. తల్లిదండ్రులు కూడా పిల్లల కదలికలను గమనిస్తూ ఉండాలి. ఎవరు ఎవరితో వెళుతున్నారు..ఎక్కడికి అన్నది గుర్తించాలి. మాదక ద్రవ్యాల ముఠాలు విద్యార్థులను లక్ష్యంగా చేసుకని వ్యాపారాలు చేస్తున్నాయి. కఠినంగా వ్యవహరించకపోతే యువత తీవ్ర ప్రమాదంలో పడేలా ఉంది. పిల్లల ప్రవర్తనను, వారు ఎక్కడెక్కడి వెళుతున్నారన్నది తల్లిదండ్రుల నిరతంరం గమనించాలి. వారరు ఎవరి వలలో అయినా పడుతున్నారా అన్నది గుర్తించాలి. విద్యా సంస్థల్లో అవసరమైతే చెకింగ్స్ పెట్టాలి. ఈ రకంగా పిల్లలపై దుష్ప్రభావం చూపకుండా చేయాలి. మాదక ద్రవ్యాల ముఠాలు ఇప్పటికే ఐటి రంగాన్ని, సినిమా రంగాన్ని కేడా ప్రభావితం చేస్తున్నాయి. డ్రగ్స్ పార్టీలు కలకలం రేపుతున్నాయి. ఫామ్‌హౌజ్ పార్టీల్లో డ్రగ్స్ వాడకం పెరిగింది. ఇటీవల పలు కేసుల్లో ఇది నిరూపితం అయ్యింది. ఇతర దేశాలతో పోల్చితే భారతదేశంలో మాదకద్రవ్యాల వినియోగం తక్కువగా ఉంది. అయితే ప్రపంచ వ్యాప్తంగా మాదకద్రవ్యాల అక్రమ రవాణాలో భారత్ క్రమేణా కీలక పాత్ర వహిస్తోంది. సహజంగానే ఇది ఆందోళన కలిగించే అంశం. విశ్వవ్యాప్తంగా ఉత్పత్తి అవుతోన్న హెరాయిన్‌లో 95శాతం థాయిలాండ్, బర్మా, ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్థాన్ లలోనే ఉత్పత్తి అవుతోంది. ఈ దేశాల మధ్య ఉన్న భారత్‌కు మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడం కత్తి మీద సాముగా ఉంది. మాదక ద్రవ్యాల అక్రమరవాణాకు భౌగోళికంగా భారత్ అనువుగా ఉంది. దీంతో అంతర్జాతీయ ముఠాలు భారత్‌పై కన్నేసి ఉంచాయి. భారత్ నుంచి విదేశాలకు నిత్యం రాకపోకలు సాగించే ప్రవాసులను పావులుగా వాడుకోవడానికి ఆ మాఫియా ముఠాలు శతవిధాలుగా ప్రయత్నిస్తున్నాయి. మాదక ద్రవ్యాలన్నింటిలోనూ ఖరీదైన హెరాయిన్‌ను భారతదేశంలో ప్రతి రోజు సగటున 28 లక్షల మంది ఒక టన్ను మేరకు వినియోగిస్తున్నట్టు ఒక సర్వేలో వెల్లడయింది. కేంద్ర ప్రభుత్వమే స్వయంగా ఈ విషయాన్ని తెలిపింది. దీన్ని బట్టి మాదక ద్రవ్యాల వినియోగం ఎంతగా పెరిగిపోయిందో అర్థం చేసుకోవచ్చు. ఒక్క హెరాయిన్ ద్వారా భారత్‌లోకి ప్రతి సంవత్సరం 1.44 లక్షల కోట్ల రూపాయల సొమ్ము మనీలాండరింగ్ ద్వారా వస్తుందని కూడా కేంద్రప్రభుత్వ అధ్వర్యంలోని జాతీయ మాదక ద్రవ్యాల నియంత్రణ సంస్థ అంచనా వేసింది. ఆరంభంలోనే ఈ అక్రమాన్ని నిర్మూలించడానికి సమగ్ర చర్యలు తీసుకోకపోతే తెలుగు రాష్ట్రాల, పంజాబ్‌కు తేడా లేకుండాపోతుంది. మరీ ముఖ్యంగా స్కూళ్లు, కాలేజీలు లక్ష్యంగా ముఠాలు పనిచేస్తున్నట్లు ఇటీవల గుర్తించారు. పిల్లు మాదక ద్రవ్యాలకు బానిసలైతే వారిని దారిలోకి తీసుకుని రావడం కష్టం. అందువల్ల ఈ ముఠాల మూలాలను కనుగొని వాటిని నిర్మూలించాల్సి ఉంది. తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రవాసులతో పాటుగా దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రవాసుల ద్వారా వారికే తెలియకుండా మాదక ద్రవ్యాలను విదేశాలకు సరఫరా చేస్తున్నట్లుగా ఇప్పటి వరకు బహిర్గతమైన కేసుల ద్వారా తెలుస్తోంది. గల్ఫ్ దేశాల్లో మాదక ద్రవ్యాల రవానా, సేవనం పై కఠిన ఆంక్షలు ఉన్నాయి. అక్కడ చాలామంది కఠిన శిక్షలకు గురవుతున్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నేరంపై గల్ఫ్ దేశాలలో ముఖ్యంగా కువైత్‌లో ఆంధప్రదేశ్ ప్రవాసులు అధిక సంఖ్యలో జైళ్ళలో మగ్గుతున్నారు. కువైత్ కేంద్ర కారాగారంలో మాదక ద్రవ్యాలకు సంబంధించిన నేరాలపై శిక్ష అనుభవిస్తున్న భారతీయ ఖైదీలలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారే అత్యధికంగా ఉన్నారు. హెరాయిన్ కంటే స్వల్ప ప్రభావం కలిగిన ఔషధ మందులు, గంజాయిని రవాణా చేస్తూ పట్టుబడ్డ వారు యు.ఏ.ఇ., ఖతర్ తదితర దేశాలలోని జైళ్ళలో మగ్గుతున్నారు. దురదృష్టవశాత్తు వీరి నేరాల విషయమై స్వదేశంలోని పోలీసులు లోతుగా విచారణ చేయలేకపోతున్నారు. కొన్ని కేసులలో దర్యాప్తునకు సహకరించడానికి కుటుంబ సభ్యులు ముందుకు రావడం లేదు. మరి కొన్ని కేసులలో స్మగ్లింగ్ ముఠాలు గల్ఫ్ జైళ్ళలో మగ్గుతున్న వారి కుటుంబ సభ్యులకు నెలకు కొంత మొత్తం పారితోషికం ఇస్తున్నారు. దీంతో సంబంధిత ఖైదీల కుటుంబాలు కూడా దర్యాప్తునకు సహకరించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. విదేశాలకు అక్రమ రవాణా అటుంచి స్వదేశంలోనూ మాదక ద్రవ్యాల వినియోగం పెరిగిపోతోంది. హైదరాబాద్‌తో సహా దేశవ్యాప్తంగా పలు నగరాలలో యువతీయువకులు మాదక ద్రవ్యాల వ్యసనానికి గురవుతున్నారు. గల్ఫ్‌లో పుట్టిపెరిగిన కొంత మంది పిల్లలను వారి తల్లిదండ్రులు ఉన్నత విద్యాభ్యాసానికై హైదరాబాద్‌కు పంపించడానికి డ్రగ్స్ కారణంగా భయపడుతున్నారు. ఈ క్రమంలో స్కూళ్లు, కాలేజీల్లో నిఘా పెంచాలి. పిల్లలు ఎవరితో వెళుతున్నారో గుర్తించాలి. కాలేజీలు, స్కూళ్ల పరిసరాల్లో సిసి కెమెరాలను పెంచాలి. దీంతో పిల్లల యోగక్షేమాలకు కూడా అవకాశం ఏర్పడుతుంది. దేశంలో యువతను డ్రగ్స్ మహమ్మారి నుంచి కాపడే యత్నం చేయాలి. డ్రగ్స్ రవాణాపై మరింత కఠనంగా వ్యవహరిస్తే తప్ప ఇది సాధ్యం కాదు.

# నీట్ రీ-ఎగ్జామ్‌కు కట్టుదిట్టమైన భద్రత

- పేపర్ తయారీ నుంచి పంపిణీ వరకు ప్రత్యేక నిఘా
- వాయుసేన సహాయంతో ప్రశ్నపత్రాల రవాణా
- జూన్ 21 వరకు రహస్య ప్రదేశంలో నిపుణులు



AI generated image

**న్యూఢిల్లీ, జూన్ 8:** నీట్-యూజీ పరీక్ష పేపర్ లీకేజీ వివాదం నేపథ్యంలో జూన్ 21న నిర్వహించనున్న రీ-ఎగ్జామినేషన్‌ను అత్యంత భద్రతా ప్రమాణాలతో నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రత్యేక చర్యలు చేపట్టాయి. పేపర్ లీకేజీకి ఏమాత్రం అవకాశం లేకుండా బహుళ అంచెల భద్రతా వ్యవస్థను అమలు చేయనున్నట్లు సమాచారం. ప్రశ్నపత్రాల తయారీలో పాల్గొన్న నిపుణులు, మోడరేటర్లు, అనువాదకులను పరీక్ష పూర్తయ్యే వరకు రహస్య ప్రదేశంలో ఉంచినట్లు తెలుస్తోంది. వారికి మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర కమ్యూనికేషన్ పరికరాలు అందుబాటులో లేకుండా కఠిన నిఘా ఏర్పాటు చేశారు. అనుమతి పొందిన సిబ్బందికి మాత్రమే ప్రవేశం కల్పిస్తున్నారు. గతంలో ప్రశ్నపత్రాల రవాణా సమయంలో లీకేజీకి అవకాశం లభించిన నేపథ్యంలో ఈసారి భారత వైమానిక దళం సహాయంతో ప్రశ్నపత్రాలను దేశంలోని వివిధ ప్రాంతాలకు తరలించనున్నారు. ఎయిర్‌ఫోర్స్ విమానాలు, హెలికాప్టర్ల ద్వారా ప్రశ్నపత్రాలను సురక్షితంగా పంపిణీ చేయాలని నిర్ణయించారు. ప్రశ్నపత్రాల బాక్సులకు జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థను అమలు చేయడంతో పాటు, ప్రింటింగ్, ప్యాకేజింగ్, స్టోరేజీ, రవాణా, పంపిణీ ప్రతి దశలో ప్రత్యేక భద్రత కల్పిస్తున్నారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థుల బయోమెట్రిక్ గుర్తింపును పకడ్బందీగా పరిశీలించనున్నారు. సోషల్ మీడియాలో నకిలీ ప్రశ్నపత్రాలు విక్రయిస్తున్న ముఠాలపై నిఘా పెట్టేందుకు సైబర్ విభాగాన్ని కూడా రంగంలోకి దించారు. గత పరీక్ష రద్దు కావడంతో రీ-ఎగ్జామ్‌కు హాజరయ్యే విద్యార్థుల నుంచి ఎలాంటి అదనపు ఫీజు వసూలు చేయబోమని కేంద్ర విద్యాశాఖ స్పష్టం చేసింది. పరీక్ష నిర్వహణకు అయ్యే మొత్తం వ్యయాన్ని ప్రభుత్వమే భరిస్తుందని తెలిపింది. జూన్ 21న దేశవ్యాప్తంగా 551 నగరాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు నీట్-యూజీ రీ-ఎగ్జామినేషన్ నిర్వహించనున్నారు. వదంతులను నమ్మకుండా ప్రశాంతంగా పరీక్షకు సిద్ధం కావాలని ఎన్‌టీఏ అభ్యర్థులకు సూచించింది.

# మోడీ పాలనతో చిక్కుల్లో దేశం

- సర్ ప్రక్రియతో లక్షలాది మంది ఓట్లు గల్లంతు
- రాజకీయ వేధింపులకు దర్యాప్తు సంస్థల దుర్వినియోగం
- ఇండియాకూటమి భేటీలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే




**న్యూఢిల్లీ, జూన్ 8:** ప్రధాని నరేంద్ర మోదీ పాలనతో భారతదేశం సమస్యల్లో పడిందని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ చీఫ్ మల్లికార్జున ఖర్గే అన్నారు. మోదీ హయాంలో రాజ్యాంగంపై నిరంతరం దాడులు జరుగుతున్నాయని.. బీజేపీయేతర రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందని మండిపడ్డారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ వేధింపులకు వాడుకుంటున్నారని ఆరోపించారు. సోమవారం ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో ఇండియా బ్లాక్ కూటమి పార్టీల నేతలు సమావేశమయ్యారు. మోదీ ప్రభుత్వంలో దేశం ఎదుర్కొంటున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక, విదేశాంగ విధాన సవాళ్లపై చర్చించారు. ఈ సందర్భంగా కూటమి పార్టీలను ఉద్దేశించి ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ప్రసంగించారు. దేశ ఆర్థిక పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉందని ఆయన అన్నారు. ఉద్యోగాల కల్పనకు అవసరమైన పెట్టుబడులు దేశానికి రావడం లేదని పేర్కొన్నారు. పలు రంగాల్లో ప్రైవేట్ గుత్తాధిపత్యాలు పెరుగుతున్నాయని తెలిపారు. మరోవైపు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ తో లక్షలాది మంది ప్రజలు ఓటు హక్కును కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఎస్‌ఎమ్‌ఈ రంగం తీవ్ర సంక్షోభంలో పడిందన్నారు. మోదీ ప్రభుత్వంలో పరీక్షల నిర్వహణ వైఫల్యాలతో యువత నష్టపోతున్నారని ఖర్గే చెప్పుకొచ్చారు. మూడేళ్ల క్రితం ఇండియా కూటమి ఏర్పడిందని, పార్లమెంటులో ఇటీవల దాని బలం ఏంటో అధికార పక్షం రుచి చూసిందన్నారు. లోక్‌సభలో మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన డీలిమిటేషన్ బిల్లును ఓడించేందుకు ఈ ఏడాది ఏప్రిల్ 17న కూటమి పార్టీలు దృఢంగా ఏకమయ్యాయని ఖర్గే ప్రశంసించారు. ఇప్పుడు ఆ స్ఫూర్తిని మరింత బలోపేతం చేసుకుని ముందుకు సాగాలన్నారు. దేశం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రతిపక్షం ఐక్యంగా ఉండాలన్నారు. కీలక సమావేశానికి 23 ప్రతిపక్ష పార్టీల నేతలు హాజరయ్యారు. వారిలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్, తేజస్వీ యాదవ్, మమతా బెనర్జీ, దీపాంకర్ భట్టాచార్య, మెహబూబా ముఫ్తీ, సుప్రియా సూలే, త్రివన్ థోల్ తదితరులు ఉన్నారు. అయితే, కీలక భాగస్వాములైన డీఎంకే, ఆప్ పార్టీలు మాత్రం సమావేశానికి దూరంగా ఉన్నాయి.

# టీఎంసీకి మరో ఎదురుదెబ్బ

**రాజ్యసభ ఎంపి రాజీనామా**

**కోల్‌కతా, జూన్ 8:** టీఎంసీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ ఎంపీ సుఖేందు శేఖర్ రాయ్ తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. టీఎంసీతో తన బంధాన్ని తెంచుకుంటున్నట్లు వెల్లడించారు. పార్టీ అసెంబ్లీ సభ్యుల్లో తిరుగుబాటు పార్లమెంట్ వైపు కూడా పాకొచ్చని ఇటీవలే ఆయన పార్టీ తీరుపై అసంతృప్తి వ్యక్తంచేశారు. టీఎంసీలో అంతర్గత విభేదాలు పెరుగుతున్న వేళ ఆయన పార్టీ నుంచి వైదొలగడం ప్రాధాన్యం సంతరించుకుంది. టీఎంసీలో అత్యంత వాక్చాతుర్యం గల సీనియర్ నాయకులలో ఒకరిగా సుఖేందు పేరు సంపాదించారు. పార్టీని వీడుతున్నట్లు సుఖేందు తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీకి లేఖ రాశారు. అందులో పార్టీలో విచ్చలవిడిగా పెరిగిపోయిన అవినీతిని, మహిళలపై తీవ్ర అణచివేతను, విద్య, ఆరోగ్య సంరక్షణ, పరిశ్రమ, ఉపాధి, శాంతిభద్రతలతో సహా పలు రంగాలలో నెలకొన్న తీవ్ర అరాచకాన్ని ప్రజలు తిరస్కరించారని పేర్కొన్నారు. మరోవైపు భాజపాపై ప్రశంసలు కురిపించారు. బెంగాల్ చరిత్రలో తొలిసారిగా ఓటర్లు ఆ పార్టీకి భారీ విజయాన్ని అందించారన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన హామీల అమలు దిశగా కొత్తగా ఎన్నికైన ప్రభుత్వం ఇప్పటికే చర్యలు ప్రారంభించిందని ప్రశంసించారు. ఇప్పటికే దాదాపు 61 మంది ఎమ్మెల్యేలు పార్టీ రెబల్ నేత రితబ్రతకు మద్దతివ్వడంతో శాసనసభలో ప్రతిపక్ష నాయకుడిగా స్పీకర్ ఆయనను నియమించారు. అసమ్మతి ఎమ్మెల్యేలతో ఆ పార్టీ ఎంపీలు కూడా టచ్‌లో ఉన్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో సుఖేందు తన పదవికి రాజీనామా చేయడం గమనార్హం. మరో ఎంపీ కోయల్ మల్లిక్ కూడా తన రాజ్యసభ స్థానానికి రాజీనామా చేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి.

# పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

**ఇరాన్‌ను వీడాలని భారత్ అడ్వైజరీ**

**న్యూఢిల్లీ, జూన్ 8:** ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య మరోసారి తీవ్రస్థాయిలో దాడులు జరుగుతున్నాయి. దీంతో పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో టెహ్రాన్‌లోని భారత ఎంబసీ అడ్వైజరీ జారీ చేసింది. తక్షణమే ఇరాన్‌ను వీడాలని అక్కడి భారత పౌరులకు సూచించింది. పశ్చిమాసియాలో నెలకొన్న తాజా పరిణామాల దృష్ట్యా ప్రస్తుతానికి భారత పౌరులు ఇరాన్‌కు ప్రయాణాలను మానుకోవాలని సూచిస్తున్నాం. ఇక, ఇరాన్‌లో ఉన్న భారత పౌరులు అందుబాటులో ఉన్న రవాణా మార్గాల్లో వెంటనే ఆ దేశాన్ని వీడాలని హెచ్చరిస్తున్నాం అని ఎంబసీ తమ అడ్వైజరీలో వెల్లడించింది. ఫిబ్రవరి 28న పశ్చిమాసియాలో ఘర్షణలు మొదలైన నాటినుంచి భారత్ పలుమార్లు ఇలాంటి ప్రయాణ సూచనలు జారీ చేసింది. యుద్ధం ప్రారంభమైన తర్వాత దాదాపు 1600 మందికి పైగా భారత పౌరులను ఇరాన్ నుంచి తరలించింది. ఇక, ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇటీవల పశ్చిమాసియా దేశాల నుంచి దాదాపు 6 లక్షల మంది భారత పౌరులు స్వదేశానికి తిరిగొచ్చినట్లు విదేశాంగశాఖ వెల్లడించింది. ఇదిలాఉండగా.. ఆదివారం అర్ధరాత్రి నుంచి ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఘర్షణలు మళ్లీ తీవ్రస్థాయికి చేరుకున్నాయి. లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడికి ప్రతీకారంగా ఇరాన్ దాడులు మొదలుపెట్టింది. దీంతో ఇజ్రాయెల్ దీటుగా ప్రతిస్పందించింది. టెహ్రాన్‌కు చెందిన మషహర్ పెట్రోకెమికల్ ఎ÷-లాంట్‌పై దాడి చేసింది. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ మిలిటరీ వెల్లడించింది. ఈ ఘటనలో ప్లాంట్ తీవ్రంగా ధ్వంసమైనట్లు తెలుస్తోంది. నైరుతి ఇరాన్‌లో పెట్రో కెమికల్స్ ఎగుమతుల్లో మషహర్ కాంప్లెక్స్ అత్యంత కీలకమైనది.

# హోర్ముజ్ జలసంధి మూసివేత

**సంక్షోభంకొనసాగితే ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం**

**దేశంలో 30 నుంచి 60 రోజులకు సరిపడా ఇంధన నిల్వలు**

**కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల శాఖ మంత్రి హర్దీప్**



న్యూఢిల్లీ, జూన్ 8: హోర్ముజ్ జలసంధి మూసి ఉంచినప్పటికీ దేశంలో ఇంధన నిల్వలకు ఢోకా లేదని కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ తెలిపారు. 30 నుంచి 60 రోజుల వరకూ సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని కేంద్రమంత్రి తెలిపారు. అయితే పశ్చిమాసియాలో యుద్ధ సంక్షోభం సుదీర్ఘకాలం కొనసాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు. సోమవారంనాడిక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ... 'మరో 30 రోజులు హోర్ముజ్ జలసంధి మూతపడే ఉంటే ఏం జరుగుతుంది? దేశీయంగా మనకు తగినన్ని నిల్వలు ఉన్నాయి. 60-60-60 అని చెప్పగలను. అంటే 60 రోజులకు సరిపడా క్రూడాయిల్, నేచురల్ గ్యాస్, ఎల్‌పీజీ నిల్వలు ఉన్నాయి' అని హర్దీప్ సింగ్ పురీ చెప్పారు. స్వల్పకాలిక అంతరాయాలను భాగస్వామ్య దేశాల సపోర్ట్‌తో అధిగమించేందుకు అవసరమైన వ్యూహాత్మక ప్రణాళికలు తమ వద్ద ఉన్నాయని అన్నారు. పశ్చిమాసియాలో పరిస్థితి రెండు మూడు రకాలుగా ఉండొచ్చని, ఘర్షణలు విస్తరిస్తే అది అసాధారణ పరిస్థితి అవుతుందని, అది బాధాకరమని అన్నారు. ఒకవేళ హోర్ముజ్ జలసంధిని మూసి ఉంచిన పక్షంలో ప్రత్యామ్నాయ మార్గాల కోసం ఇప్పటికే చర్యలు ప్రారంభించామని చెప్పారు. యూఏఈ వంటి మంచి మిత్రులు మనకున్నారని, ఎల్పీజీ కార్గోలను నేరుగా మనకు పంపగలమని యూఏఈ నుంచి ప్రతిపాదన ఉందని, పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోగలమని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతానికి దేశీయంగా స్ట్రాటజిక్ పెట్రోలియం సహా 30 నుంచి 60 రోజులకు సరిపడా అన్నిరకాల నిల్వలు ఉన్నాయని చెప్పారు. ఇవి 76 నుంచి 80 రోజులకు కూడా సరిపోవచ్చన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా బ్యాంకెట్ హాల్

- సెట్ బాక్ లేకుండానే నిర్మాణం
- 63వ జాతీయ రహదారి ప్రక్కనే అక్రమ నిర్మాణాలు
- మున్సిపల్ అధికారులకు పిర్యాదు చేసినా చర్యలు శూన్యం
- జిల్లా కలెక్టర్ ప్రజా వాణిలో మరోసారి పిర్యాదు
- చుక్క గంగారెడ్డి సీనియర్ జర్నలిస్ట్

**జగిత్యాల, జూన్ 8:**

జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలో 63వ జాతీయ రహదారిని ఆనుకొని ఎలాంటి సెట్ బాక్ లేకుండానే బ్యాంకెట్ హాల్ నిర్మాణం చేస్తున్నారని ఆరోపిస్తూ వెంటనే చర్యలు తీసుకోవాలని మరోసారి జిల్లా కలెక్టర్ ప్రజా వాణిలో సోమవారం వంకాయల ముఖేష్ చంద్ర పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడారు. ఈ బ్యాంకెట్ హాల్ ప్రక్క నుండి, పై నుండి విద్యుత్ మెయిన్ లైన్ వైర్లు కూడా ఉన్నాయని తెలిపారు. రోడ్డు ప్రమాదాల వలన గానీ, విద్యుత్ ప్రమాదాల వలన గానీ, ఇతర అనుకోని సంఘటనలు, అగ్ని ప్రమాదాలు జరిగితే అదుపు చేయలేని పరిస్థితి ఉంటుందన్నారు. గత ఏప్రిల్ 30న మెట్ పల్లి మున్సిపల్ అధికారులకు పిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని జిల్లా కలెక్టర్ కు ఇచ్చిన పిర్యాదులో ఆయన పేర్కొన్నారు. ఈ బ్యాంకెట్ హాల్ రాజకీయ ప్రముఖులకు చెందినదని అధికారులు




చర్యలు తీసుకోవడం లేదన్నారు. మెట్పల్లి మున్సిపల్ అధికారులకు కఠినమైన ఆదేశాలు జారీ చేసి ఇప్పటికైనా చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకోవాలని ఆయన జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు.

# సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోవద్దు.

- తస్మాత్ జాగ్రత్త: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్
- లోన్ యాప్స్ ద్వారా అప్పు... మీ ప్రాణాలకు ముప్పు
- సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కు కాల్ చేయండి
- NCRP పోర్టల్‌లో ఫిర్యాదు చేయండి

**నారాయణపేట, జూన్ 08 :** నారాయ ణపేట ప్రజలు సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వారు చూపించే మోసపూరిత ఆశలు, ప్రకటనలు, ఆఫర్లకు లోనుకాకూడదని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ తెలిపారు.ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని, ముఖ్యంగా అధిక లాభాల పేరుతో పెట్టుబడులు పెట్టించి కోట్ల రూపాయలు దోచుకుంటున్నారని పేర్కొన్నారు. సోషల్ మీడియా ప్రకటనలు, వాట్సాప్ సందేశాలు, అపరిచిత వ్యక్తుల సూచనలను నమ్మి ఆన్‌లైన్ పెట్టుబడులు పెట్టరాదని సూచించారు. "మీరు పెట్టుబడి పెట్టండి... మీ బంధుమిత్రులతో కూడా పెట్టుబడి పెట్టించి భారీ లాభాలు పొందండి" అంటూ ఆశ చూపించే చైన్ ఇన్వెస్ట్‌మెంట్ పథకాలు పూర్తిగా మోసపూరితమైనవేనని హెచ్చరించారు.ఎవరైనా అపరిచిత వ్యక్తులు క్యూఆర్ కోడ్ పంపించి స్కాన్ చేస్తే డబ్బులు వస్తాయని చెబితే నమ్మరాదని తెలిపారు. డబ్బులు పొందడానికి క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాల్సిన అవసరం లేదని, అలాంటి సందేశాలు సైబర్ మోసాలకు సంకేతమని పేర్కొన్నారు.ఆన్‌లైన్ లోన్



యాప్స్ పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. లోన్ యాప్‌లను మొబైల్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసిన వెంటనే ఫోన్‌లోని కాంటాక్టులు, ఫోటోలు, వ్యక్తిగత వివరాలు, ఇతర సమాచారం సేకరించి తర్వాత వేధింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. రుణం పూర్తిగా చెల్లించిన తర్వాత కూడా అదనపు డబ్బులు డిమాండ్ చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. అందువల్ల అనుమతి లేని లోన్ యాప్‌ల ద్వారా రుణాలు తీసుకోవద్దని సూచించారు.లోన్ యాప్ వేధింపులకు గురైన వారు మానసికంగా కుంగిపోవద్దని,క్షణికావేశాలకు లోనుకావద్దని ఎస్పీ తెలిపారు. వెంటనే కుటుంబ సభ్యులు, స్నేహితులకు విషయం తెలియజేసి పోలీసుల సహాయం తీసుకోవాలని సూచించారు. సైబర్ మోసాలు లేదా వేధింపుల విషయంలో వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930 లేదా డయల్ 100కు కాల్ చేయాలని కోరారు.కస్టమర్ కేర్ నంబర్ల కోసం గూగుల్‌లో వెతికి వచ్చే నంబర్లను నమ్మరాదని, సంబంధిత సంస్థ అధికారిక వెబ్‌సైట్‌లో ఉన్న నంబర్లను మాత్రమే ఉపయోగించాలని సూచించారు. నకిలీ కస్టమర్ కేర్ నంబర్ల ద్వారా కూడా సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నారని హెచ్చరించారు.పండుగలు, ప్రత్యేక ఆఫర్ల సమయంలో షాపింగ్ మాల్స్, దుకాణాల్లో ఇచ్చే లాటరీ కూపన్లలో వ్యక్తిగత వివరాలు నమోదు చేసే విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఫోన్ నంబర్లు, ఈ-మెయిల్ ఐడీలు వంటి వ్యక్తిగత సమాచారం సైబర్ నేరగాళ్ల చేతికి చేరే ప్రమాదం ఉందన్నారు.ఇటీవల వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా వీడియో కాల్స్ చేసి ఫోటోలను మార్ఫింగ్ చేసి అసభ్యకర చిత్రాలుగా మార్చి బంధువులకు పంపిస్తామని, యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తామని బెదిరించి డబ్బులు వసూలు చేసే ఘటనలు పెరుగుతున్నాయని తెలిపారు. ఇలాంటి బెదిరింపులకు భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు.అదేవిధంగా పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, లాటరీలు, గిఫ్ట్‌లు, కేవైసీ అప్‌డేట్‌లు, బ్యాంక్ ఖాతా ధృవీకరణ పేరుతో వ్యక్తిగత వివరాలు సేకరించి డబ్బులు కాజేస్తున్నారని తెలిపారు. అపరిచిత లింకులు క్లిక్ చేయరాదని, ఓటీపీలు, బ్యాంక్ వివరాలు, పాస్‌వర్డు ఎవరికీ చెప్పరాదని హెచ్చరించారు.సైబర్ నేరాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని జిల్లా పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్పీ తెలిపారు. ప్రజలు తాము అప్రమత్తంగా ఉండటమే కాకుండా కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధుమిత్రులకు కూడా సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని కోరారు.

# నేరాల నియంత్రణపై దృష్టి సారించాలి, లాంగ్ పెండింగ్ కేసులను క్లియర్ చేయాలి

- DCRB డీఎస్పీ మహేష్
- డీఎస్పీ నల్లపు లింగయ్య.

**నారాయణపేట, జూన్ 08:**

నారాయణపేట జిల్లా పోలీస్ కార్యాలయంలోనీ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం డీఎస్పీ లు మహేష్, లింగయ్య ఆధ్వర్యంలో క్రైమ్ రివ్యూ మీటింగ్ నిర్వహించడం జరిగింది. జిల్లాలోని అన్ని సర్కిల్స్, పోలీస్ స్టేషన్లలో లాంగ్ పెండింగ్ కేసులు వెంటనే క్లియర్ చేయాలని, కేసుల దర్యాప్తు నాణ్యత, నేరల నియంత్రణ పై చర్యలు తీసుకొని ప్రజలకు మెరుగైన సేవలుఅందించాలి అని తెలిపారు.ఈ సందర్భంగా డీఎస్పీ లు మాట్లాడుతూ... ప్రతి కేసులో 'క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్' ద్వారా నేరస్తులకు శిక్ష పడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు. కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని, పోలీస్ అధికారులంతా బాధ్యతగా పని చేయాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవని అన్నారు. పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్ వాహనాలతో అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, విసబుల్ పోలీసింగ్ విధులు నిర్వర్తించాలని తెలిపారు. నిషేధిత గంజాయి అక్రమరవాణా,మట్కా,జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్త సీసీ కెమెరాలను ఏర్పాటు, అవి నిరంతరం పనిచేసే విధంగా మానిటర్ చేయాలని సూచించారు. దొంగతనల కేసుల్లో ప్రస్తుతం పోలీసు శాఖ వినియోగిస్తున్న సాంకేతికతను ఉ






పయోగించి లాంగ్ పెండింగ్ కేసులలోని నేరస్తులను పట్టుకుని సొత్తును రికవరీ చేసి భాదితులకు త్వరతగతిన అందేలా చూడాలని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరారు. విలేజ్ పోలీసు అధికారులు గ్రామలలో పర్యటిస్తూ ప్రజలతో మమేకమవుతూ సామాజిక అంశాల పై అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లా పోలీస్ వ్యవస్థ పటిష్టతపై దృష్టి సారించాలనీ, ప్రతి అధికారి తాను బాధ్యత వహిస్తున్న ప్రాంతంలో నేరాలు జరగకుండా కృషి చేయాలని తెలిపారు.ఈ సమావేశంలో సీఐ లు భగవంత్ రెడ్డి, సైదులు ఎస్సైలు వెంకటేశ్వర్లు, సతీష్ రెడ్డి ఎస్.ఎం నవీద్, రాజు, అశోక్ బాబు, రాజు, బాలరాజు, రమేష్, రాము, రాజశేఖర్, రమేష్, పురుషోత్తం, నరేష్, సునీత, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## రాయికోడ్ మండల పాఠశాలలకు పాఠ్యపుస్తకాల పంపిణీ



**రాయకోడ్, :** 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం రాయకోడ్ మండల వనరుల కేంద్రం ఎమ్మార్సీ వద్ద ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి జీ నర్సింలు పాఠ్యపుస్తకాల పంపిణీని ప్రారంభించారుఈ సందర్భంగా జెడ్పీహెచ్ఎస్ రాయకోడ్ ప్రధానోపాధ్యాయులు నాగేష్ ఎం.పి.పి.ఎస్ రాయకోడ్ ప్రధానోపాధ్యాయులు బి. శ్రీనివాస్ పాఠశాల విద్యా కమిటీ అధ్యక్షులు ఖైరత్ అలీ మరియు మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారుకార్యక్రమంలో మాట్లాడుతూ ఎంఈఓ నర్సింలు విద్యార్థులందరికీ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే పాఠ్యపుస్తకాలు అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పుస్తకాలను వెంటనే విద్యార్థులకు పంపిణీ చేసి బోధన-అభ్యసన కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు .పాఠ్యపుస్తకాల సకాలంలో పంపిణీ ద్వారా విద్యార్థులు విద్యా సంవత్సరాన్ని ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రారంభించగలరని పాల్గొన్న అధికారులు మరియు ప్రధానోపాధ్యాయులు అభిప్రాయపడ్డారుఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు

## మహిళల భద్రత కోసం "షీ" టీమ్ ప్రత్యేక చర్యలు సబ్‌డివిజన్ "షీ" టీమ్ ఇంచార్జ్ నర్సిములు



**పరిగి మండలం,జూన్ 08 :** మహిళలు, బాలికల భద్రతను పరిరక్షిం చడమే లక్ష్యంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న" షీ" టీమ్ సమర్థవంతంగా సేవలందిస్తోందని పరిగి సబ్‌డివిజన్ "షీ" టామ్ ఇంచార్జ్ నర్సిములు అన్నారు.జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు పరిగి డిఎస్పీ శ్రీనివాస్ మార్గదర్శకత్వంలో పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలోని చిగురాలపల్లి గ్రామ శివారులో కోళ్ల ఫామ్ లో పరిగి సబ్‌డివిజన్ "షీ" టీమ్ ఇంచార్జ్ నర్సిములు ఆద్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా పలు ముఖ్య అంశాలపై అవగాహన కల్పించారు.ముఖ్యంగా మహిళలపై జరుగుతున్న నేరాలు, నిర్భయ చట్టం, పోక్సో చట్టం, డయల్ 100, "షీ" టీమ్ హెల్ప్‌లైన్ 181, సీసీ కెమెరాల ప్రాముఖ్యత వంటి విషయాలను వివరించారు. అలాగే బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, కమ్యూనిటీ పోలీసింగ్, మానవ అక్రమ రవాణా, మద్యపాన నిషేధం, బ్యాంకింగ్ ఆన్‌లైన్ మోసాలు, గంజాయి నిర్మూలన, డ్రగ్స్ నిషేధం అలాగే సైబర్ నేరాలపై (హెల్ప్‌లైన్ నం. 1930) సమగ్ర అవగాహన కల్పించారు.విద్యార్థులు చట్టాలపై స్పష్టమైన అవగాహన కలిగి, అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కోళ్ల ఫామ్ మేనేజర్,కోళ్ల ఫామ్ వర్కర్స్,మరియు "షీ" టీమ్ సభ్యులు సావిత్రి, పాల్గొన్నారు.

## పేదల సాధికారతకు దశాబ్దపు మార్పు

**న్యూ డిల్లీ జూన్08 :** గత 12 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వ పథకాలు పేదల జీవితాల్లో గణనీయమైన మార్పు తీసుకొచ్చాయి. తాగునీరు, పారిశుధ్యం, ఆరోగ్య రక్షణ, ఆహార భద్రత, గృహ వసతి, విద్య వంటి రంగాల్లో విస్తృత ప్రగతి నమోదైంది. 2013-14లో 29.17 శాతంగా ఉన్న బహుమితీయ పేదరికం 2022-23 నాటికి 11.28 శాతానికి తగ్గింది. 2014 నుంచి సుమారు 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో పైపుల ద్వారా తాగునీటి సౌకర్యం పొందిన గృహాలు 3.23 కోట్ల నుంచి 15.84 కోట్లకు పెరిగాయి.స్వచ్ఛ భారత్ మిషన్ కింద 12.11 కోట్లకు పైగా గృహ మరుగుదొడ్లు నిర్మించగా, పీఎం ఉజ్వల యోజన ద్వారా 10.57 కోట్లకు పైగా ఎల్‌పీజీ కనెక్షన్లు అందాయి. ఆయుష్మాన్ భారత్ కింద 43.93 కోట్ల కార్డులు జారీ అయ్యాయి. పీఎంజీకేఏవై ద్వారా 81 కోట్లకు పైగా లబ్ధిదారులకు ఉచిత ఆహార ధాన్యాలు అందుతున్నాయి.ప్రాథమిక పాఠశాలల్లో బాలికల డ్రాపౌట్ రేటు 4.6 శాతం నుంచి 0.3 శాతానికి తగ్గడం మరో కీలక పురోగతిగా నిలిచింది. స్వయం సహాయక సంఘాలు, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్ ద్వారా మహిళా సాధికారతకు ఊతమిస్తోంది.

## రైతులకు పారదర్శకంగా ఎరువుల పంపిణీ.. దేశానికే ఆదర్శంగా తెలంగాణ ఫెర్టిలైజర్ యాప్

**హైదరాబాద్, జూన్ 8 :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫెర్టిలైజర్ యాప్ దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందుతోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఎరువుల పంపిణీలో పారదర్శకత, సమర్థత, జవాబుదారీతనం పెంపొందించడంలో ఈ యాప్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు.తెలంగాణలో విజయవంతంగా అమలవుతున్న ఈ నమూనాను ఆదర్శంగా తీసుకుని పొరుగు రాష్ట్రాలు కూడా ప్రత్యేక యాప్‌ల రూపకల్పనకు చర్యలు చేపడుతున్నాయని మంత్రి వెల్లడించారు. రాష్ట్ర యాప్ పనితీరును పరిశీలించిన కేంద్రం, దేశవ్యాప్తంగా FSAS (Fertiliser Sales Application System) అమలుకు నిర్ణయం తీసుకుని రెండు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు.రైతుల సూచనల మేరకు యాప్‌లో పలు కొత్త సదు-పాయాలు అందుబాటులోకి తీసుకొచ్చామని, మీ సేవా కేంద్రాలు, టెలిఫోన్ ద్వారా ఎరువుల బుకింగ్, హెల్ప్‌లైన్, మండల మ్యాపింగ్, స్టాక్ షెడ్యూలింగ్ వంటి సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. రైతులు తమ ప్రాంతంలోని డీలర్ల వద్ద ఉన్న ఎరువుల నిల్వలను మొబైల్ ద్వారానే తెలుసుకునే అవకాశం ఉందన్నారు.ప్రస్తుత ఖరీఫ్ అవసరాల కోసం ఏప్రిల్-జూన్ నెలలకు మొత్తం 6 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించాలని కేంద్రాన్ని కోరినట్లు మంత్రి తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రానికి సుమారు 3.89 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా చేరిందని, మిగిలిన సరఫరా కోసం కేంద్రంతో నిరంతర సమన్వయం కొనసాగిస్తున్నామని చెప్పారు.రైతులకు సకాలంలో, న్యాయంగా ఎరువులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, సాంకేతికత ఆధారిత వ్యవసాయ సేవల విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

# సిద్దిపేట జిల్లా రవాణా శాఖ అధికారిగా జోగేశ్వర్ యాదవ్



**సిద్దిపేట జూన్ 8 :** జిల్లా రవాణా శాఖ అధికారిగా జోగేశ్వర్ జాదవ్ బాధ్యతలు చేపట్టిన అనంతరం శనివారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా కలెక్టర్ కె హైమావతి గారిని మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. మన జిల్లాలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో రవాణా శాఖను రాష్ట్రంలోనే ముందు వరసలో నిలిపేలా పనిచేయాలని సూచించారు. ఇదివరకు డిటిఓ పనిచేసిన లక్షణ్ మంచిర్యాల జిల్లాకు బదిలీపై వెళ్ళారు. ఈ కార్యక్రమంలో ఏంవిఐ శివ స్వప్న తదితరులు ఉన్నారు.

## కాలం గడిచినా చెదరని స్నేహబంధం ఒకే వేదికపైకి చేరిన నలంద పూర్వ విద్యార్థులు!



**కోటగిరి, జూన్ 08 :-** కాలం గడిచే కొద్దీ మనుషులు దూరమవుతుంటారు, కానీ నిజమైన స్నేహం మాత్రం సమయాన్ని కూడా జయించి నిలబడుతుంది. దీనికి నిదర్శనంగా నిలిచింది కోటగిరి నలంద హైస్కూల్ 2009-2010 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం. పదేళ్లు, ఆరు ఏళ్లు.. ఇలా 16 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత, ఆనాటి చిన్నారులంతా నేడు బాధ్యతాయుతమైన వ్యక్తులుగా ఒకచోట చేరినప్పుడు భావోద్వేగాల ప్రవాహం మొదలైంది. పాఠశాల గడప దాటి బయటకు వచ్చినప్పుడు అందరి కళ్లల్లోనూ ఏదో తెలియని ఆశ, భవిష్యత్తుపై భయం ఉండేవి. కానీ మళ్ళీ కలిసిన ఈ రోజు, ఆ పాత జ్ఞాపకాలు కళ్ల ముందు మెదిలాయి. ఒకరు స్కూల్ బెంచీ మీద రాసిన పేర్లు, మరొకరు మధ్యాహ్నం భోజన సమయంలో పంచుకున్న టిఫిన్లు, టీచర్ల కళ్లు గప్పి చేసిన అల్లరి.. ఇవన్నీ ఒక్కసారిగా మళ్ళీ ఆ రోజుల్లోకి తీసుకెళ్లాయి. ఎన్ని విజయాలు సాధించినా, ఎంతటి ఉన్నత స్థానాల్లో ఉన్నా, ఆనాటి స్నేహితుల ముందు మాత్రం అందరూ మళ్ళీ అదే పాత అల్లరి పిల్లలుగా మారిపోయారు. తమకు అక్షరాలను నేర్పి, జీవితంలో ఎదగడానికి పునాది వేసిన గురువులను స్మరించుకున్నప్పుడు అందరిలోనూ ఒక రకమైన ఆనందం, మరోవైపు కృతజ్ఞత కనిపించాయి. తాము ఇవాళ ఎక్కడ ఉన్నా, ఎలా ఉన్నా.. ఆ పాఠశాల నేర్పిన పాఠాలే కారణమని వారు ముక్తకంఠంతో చాటిచెప్పారు. జీవితం అంటే కేవలం ఉరుకులు పరుగులే కాదు, ఇలాంటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకోవడం కూడా అని ఈ మిత్రబృందం నిరూపించింది. 16 ఏళ్ల దూరం తమ స్నేహబంధాన్ని ఏమాత్రం చెరపలేదని, పైగా మరింత దృఢపరిచిందని వారు భావించారు. ప్రతి ఒక్కరి కళ్లల్లోనూ ఒకటే మాట.. "మళ్ళీ మళ్ళీ కలుద్దాం, ఈ బంధాన్ని ఇలాగే కాపాడుకుందాం." ఎడారిలో దొరికిన చల్లని నీటిలా, బిజీ జీవితంలో ఇలాంటి కలయికలు మనిషికి ఎంతో ఉత్సాహాన్ని, కొత్త శక్తిని ఇస్తాయి అనడంలో ఏమాత్రం సందేహం లేదు.

## చంద్ర రాజేశ్వరరావు ఆదర్శాలు యువతకు మార్గదర్శకం

- ప్రజాస్వామ్య పరిరక్షణకు వామపక్ష, సెక్యులర్ శక్తులు ఐక్యం కావాలి: కె. శ్రీనివాస్‌రెడ్డి



**హైదరాబాద్, జూన్ 8 :** కమ్యూనిస్టు ఉద్యమ దిగ్గజం చంద్ర రాజేశ్వరరావు 112వ జయంతి సందర్భంగా సీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. దేశంలో పెరుగుతున్న అసంతృప్తి, రాజకీయ వ్యవస్థపై ప్రజల్లో నెలకొంటున్న నిరాశను అధిగమించాలంటే కమ్యూనిస్టు, సెక్యులర్, సోషలిస్టు శక్తులు ప్రజలకు విశ్వసనీయ ప్రత్యామ్నాయంగా ఎదగాలని ఆయన అన్నారు. యువతను ఆకర్షించేలా కమ్యూనిస్టు ఉద్యమాలు కొత్త వ్యూహాలు అవలంబించాలని, ఆధునిక మాధ్యమాలను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. చంద్ర రాజేశ్వరరావు నిరాడంబర జీవనానికి, రాజకీయ నైతికతకు ప్రతీకగా నిలిచారని కొనియాడారు. సదస్సుకు అధ్యక్షత వహించిన డాక్టర్ కె. నారాయణ మాట్లాడుతూ యువతలో పెరుగుతున్న అసంతృప్తి, రాజ్యాంగబద్ధ సంస్థలపై నమ్మకం క్షీణించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతమని హెచ్చరించారు. సీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు జీవితం ఉద్యమ కార్యకర్తలకు ఆదర్శమని, ఆయన చూపిన మార్గంలో నడవడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఆర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో నివసిస్తున్న ప్రొఫెసర్ వేణుగోపాల్, డాక్టర్ రంగనాయకి దంపతుల 70వ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఘనంగా సన్మానించారు. వారు ఫౌండేషన్‌కు రూ.1 లక్ష విరాళం అందజేశారు.

# ప్రజలలో అవగాహన పెంపొందించేందుకే గ్రామ, వార్డు సభలు

- ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి
- పంటల మార్పిడి ఆవశ్యకతను గుర్తించాలి
- బురాన్ పూర్ గ్రామ సభలో కలెక్టర్ దీపక్ తివారి వెల్లడి



**వికారాబాద్ మండలం, జూన్,08 :** సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు వివిధ అంశాలపై ప్రజలలో అవగాహన పెంపొందించాలనే సదుద్దేశ్యంతో ప్రభుత్వం ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గ్రామ పంచాయతీలలో గ్రామ సభలను, మున్సిపల్ పట్టణాలలో వార్డు సభలను నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి వెల్లడించారు. వికారాబాద్ మండలం బురాన్ పూర్ గ్రామంలో సోమవారం స్థానిక సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభకు కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పంటల మార్పిడి, సరైన మోతాదులో ఎరువుల వినియోగం, రక్షిత మంచినీటి సరఫరా, వర్షపు నీటిని ఓడిసిపట్టడం, భూగర్భ జలాల సంరక్షణ, విరివిగా మొక్కల పెంపకం, పర్యావరణ సమతుల్యాన్ని కాపాడడం, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ, వానాకాలంలో సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వ్యవసాయ రంగంలో జిల్లా అరుదైన ఘనతను కలిగి ఉన్నదని గుర్తు చేశారు. పరిస్థితులకు అనుగుణంగా పంటల మార్పిడి విధానాన్ని అవలంభిస్తూ సాగు రంగంలో ప్రత్యేకతను చాటాలని రైతులకు సూచించారు. ఎల్ నినో ప్రభావం వల్ల తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నందున, తక్కువ సాగు నీటి అవసరం కలిగిన పంటలను విత్తుకోవాలని హితవు పలికారు. ప్రభుత్వం నోటిఫై చేసిన ఆయా పంట రకాలనే సాగు చేయాలని, నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. నకిలీ, నాసిరకం విత్తనాలను విక్రయించే డీలర్ల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని, అర్హులైన రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ సబ్సిడీలు, ఇతర ప్రయోజనాలు పొందేందుకు ఫార్మర్ రిజిస్ట్రీ దోహదపడుతుందని తెలిపారు. కాగా, వర్షాభావ పరిస్థితులు తలెత్తినా కూడా పట్టణాలు, నిర్దేశిత గ్రామాలకు తాగునీటి ఇబ్బందులు ఏర్పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని, పరిసరాల పరిశుభ్రతను పాటించడం ద్వారా ఈగలు, దోమల వ్యాప్తిని నివారించవచ్చని, తద్వారా వ్యాధులు సోకకుండా కాపాడుకోవచ్చని సూచించారు. ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలను గ్రామ పంచాయతీలు తప్పనిసరిగా అమలు చేయాలని అన్నారు. తడి, పొడి, శానిటరీ, ప్రత్యేక వ్యర్థాలను వేర్వేరుగా సేకరించాలన్నారు. ప్రత్యేక ఓటరు సవరణ(ఎస్.ఐ.ఆర్) కార్యక్రమం గురించి ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో కలెక్టర్ అవగాహన కల్పించారు. జూన్ 25 నుండి బీ.ఎల్.ఓలు ఇంటింటికి తిరుగుతూ ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ నిర్వహిస్తారని, వారికి సహకరించాలని ప్రజలను కోరారు. ప్రతి ఒక్కరు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని, మహిళలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకుంటూ ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ హితవు పలికారు. అర్హులైన వారు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ది పొందేలా చొరవ చూపాలన్నారు. గ్రామ సభలో మండల ప్రత్యేక అధికారి డీ.పీ.ఓ జయసుధ, తహసిల్దార్ లక్ష్మి నారాయణ, ఎం పి డి ఓ వినయ్ కుమార్, స్థానిక అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో "ప్రజావాణి" కార్యక్రమం లో. బాధితుల నుంచి నేరుగా వచ్చిన ఫిర్యాదులను స్వీకరించిన

- జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా ఐపీఎస్



**వికారాబాద్, జూన్,08 :** వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ పాల్గొని, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు. ప్రతి ఫిర్యాదుదారుడి సమస్యను ఆమె శ్రద్ధగా విని, సంబంధిత అంశాలపై వివరాలు తెలుసుకొని, తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే బాధితుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి, చట్టపరంగా వారికి త్వరితగతిన న్యాయం జరిగేలా పోలీస్ శాఖ కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని అధికారులకు స్పష్టం చేశారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు మరియు ఇతర బాధిత వర్గాలకు సంబంధించిన ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి, వారి భద్రత, హక్కుల పరిరక్షణకు జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగే వరకు ప్రతి కేసును నిరంతరం పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. అవసరమైతే బాధితులు నేరుగా జిల్లా ఎస్పీని సంప్రదించవచ్చని ఈ సందర్భంగా సూచించారు

## ప్రజావాణికి 26 .ఫిర్యాదులు.

- అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని...
- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక ఐఏఎస్



**నారాయణపేట, జూన్,08 :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ప్రియాంక అధికారులకు సూచించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 26 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను,లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డీజీపీ కార్యాలయంలో స్టాఫ్ ఆఫీసర్స్ తో సమావేశం నిర్వహించిన సి.వి. ఆనంద్




**హైదరాబాద్ జూన్8 :** రాష్ట్ర పోలీస్ శాఖకు సంబంధించిన పలు కీలక అంశాలపై రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ డీజీపీ కార్యాలయంలో స్టాఫ్ ఆఫీసర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కమిషనరేట్ల పరిధులు, పోలీస్ స్టేషన్ల లిమిట్లు, సరిహద్దు గ్రామాల విభజన, జ్యూరిస్డిక్షన్ సంబంధిత అంశాలపై సంబంధిత కమిషనర్లతో విస్తృతంగా చర్చించారు. సర్కిళ్లు, జోన్లు, గ్రామాల పునర్విభజన వంటి అంశాలు అన్ని శాఖలకు అనుకూలంగా ఉండేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

ఇటీవల కాలంలో వివిధ రాష్ట్రాల నుంచి, ముఖ్యంగా నేపాల్‌కు చెందిన వ్యక్తులు గృహ సేవకులుగా పనిచేస్తూ కొన్ని నేరాల్లో పాల్గొంటున్న నేపథ్యంలో, రాష్ట్రవ్యాప్తంగా డొమెస్టిక్ సర్వెంట్స్‌కు సంబంధించిన పూర్తి వివరాలు సేకరించాలని డీజీపీ ఆదేశించారు. వారు ఎక్కడ నివసిస్తున్నారు, ఎక్కడ పనిచేస్తున్నారు అనే సమాచారాన్ని డేటాబేస్ రూపంలో అందుబాటులో ఉంచాలని సూచించారు.

సమావేశంలో సీసీటీఎన్ఎస్ 2.0 అమలు, సీఐడీ వ్యవస్థ బలోపేతం, మాన్యువల్ ప్రక్రియల ఆధునీకరణ, భవిష్యత్ కార్యాచరణలపై కూడా చర్చించారు. నవంబర్ నెలలో పోలీస్ డ్రిట్ నిర్వహణతో పాటు అక్టోబర్‌లో మహిళా పోలీస్ కాన్ఫరెన్స్ నిర్వహించాలని నిర్ణయించారు. మహిళా పోలీసులకు 33 శాతం రిజర్వేషన్ సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, లా అండ్ ఆర్డర్, ఫీల్డ్ డ్యూటీలలో మరింత అవకాశాలు కల్పించాలని సూచించారు.

### సాంకేతికతకు ప్రాధాన్యం ఇవ్వాలి

పోలీసింగ్‌లో సాంకేతికత వినియోగం మరింత పెరగాల్సిన అవసరం ఉందని డీజీపీ పేర్కొన్నారు. టెక్నాలజీ ఆధారిత పోలీసింగ్ ద్వారా కోర్ అప్లికేషన్లు, సీసీటీఎన్ఎస్ 2.0 అమలు, టీజీ కాప్స్ వ్యవస్థ వినియోగంపై అధికారులు చర్చించారు. ముఖ్యంగా డయల్-100, రౌడీ షీటర్లు, వాహనాల సెర్చింగ్, హిస్టరీ షీటర్ల డేటా వంటి అంశాలను సాంకేతిక పరిజ్ఞానం ద్వారా వేగంగా అందుబాటులోకి తీసుకురావచ్చని పేర్కొన్నారు. అలాగే ఏఐ ఆధారిత పోలీసింగ్, డ్రోన్స్, హెచ్ఆర్ఎంఎస్, డేటా ఇంటెలిజెన్స్, స్మార్ట్ అప్లికేషన్ల వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డీజీపీ సూచించారు. "తెలంగాణ స్మార్ట్ పోలీసింగ్ -- యూజింగ్ టెక్నాలజీ" అనే లక్ష్యంతో ముందుకు సాగాలని అధికారులకు సూచించారు. మ్యాన్‌పవర్ మేనేజ్‌మెంట్, వెహికల్ ఆడిట్, సిబ్బంది వినియోగం, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలపై కూడా చర్చించారు. భవిష్యత్తులో ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ బ్యూరోతో పాటు ఫుడ్ అడల్టరేషన్ కంట్రోల్‌కు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని కూడా చర్చించారు. ఈ సమావేశంలో డీజీపీ తో పాటు గా హోంశాఖ కార్యదర్శి శిఖా గోయల్,ఇంటెలిజెన్స్ డిజి విజయ్ కుమార్, పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, లా అండ్ ఆర్డర్ డిజి మహేష్ భగవత్, టి జి టెక్నికల్ సర్వీసెస్ డి జి వి వి శ్రీనివాస రావు, హైదరాబాద్ కమిషనర్ సజ్జనర్, ఆక్టోపస్ డీజీ అనిల్ కుమార్, హోమ్ గార్డ్స్ డీజీ స్వాతి లక్రా, మల్టి జోన్ -× చంద్రశేఖర్ రెడ్డి, రోడ్ సేఫ్టీ ఐ జి రమేష్ నాయుడు, ఐ జి పి ఎ ఎల్ గజరావు భూపాల్, ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి, సైబరాబాద్ కమిషనర్ ఎం రమేష్ రెడ్డి, మల్కాజ్గిరి కమిషనర్ సుమతి తో పాటు పలువురు సీనియర్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా రవాణా శాఖ తనిఖీలు ముమ్మరం

## నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై కఠిన చర్యలు : మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, జూన్ 8 :** రాష్ట్రవ్యాప్తంగా రవాణా శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను మరింత కట్టుదిట్టం చేయా లని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికా రులను ఆదేశించారు. ఓవర్‌లోడింగ్, పన్నులు చెల్లించని, ఫిట్‌నెస్ లేని వాహనాలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి అవసరమైతే వాహనాలను సీజ్ చేయాలని సూచించారు. ఉమ్మడి జిల్లాల వారీగా 10 ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు, రాష్ట్ర స్థాయిలో 2 స్పెషల్ స్క్వాడ్‌లతో తనిఖీలు ముమ్మరం చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా స్కూల్ బస్సులు, మినీ వ్యాన్‌లకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరి అని పేర్కొన్న మంత్రి, అధిక సంఖ్యలో విద్యార్థులను తరలించే వాహనాలను సీజ్ చేయాలని ఆదేశించారు. ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులు నడిపే విద్యాసంస్థలపై కూడా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇతర రాష్ట్రాలకు చెందిన పన్నులు చెల్లించని వాహనాలు, నిబంధనలు ఉల్లంఘించే స్లీపర్ బస్సులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు.



సమావేశంలో స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబత్రి తదితర అధికారులు పాల్గొన్నారు.

# నక్ష సర్వే ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం
- వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి హాజరైన జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

**వికారాబాద్, జూన 08 :** నక్ష సర్వే ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తెలిపారు. సోమవారమ వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశము నిర్వహించారు. నక్ష (నేషనల్ జియో స్పాషియల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హాబీటెషన్స్) సర్వే ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదేశించారు. నక్ష సర్వే పురోగతి తదితర అంశాలపై వివిధ జిల్లాల కలెక్టర్లతో సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించగా, జిల్లా సమీకృత కార్యాలయాల వీడియో కాన్ఫరెన్సు హాలు నుండి జిల్లా కలెక్టర్ దీపక్ తివారి హాజరయ్యారు. ఆయా జిల్లాల కలెక్టర్లతో సీఎస్ మాట్లాడి.. సర్వే ఎక్కడి వరకు పూర్తి చేశారో ఆరా తీశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ..కేంద్ర సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో నక్ష కింద దేశంలోని 150 అర్బన్ లోకల్ బాడీస్ ను ఎంపిక చేశారని వెల్లడించారు. రాష్ట్రంలోని 10 మున్సిపాలిటీలు ఎంపిక చేశారని తెలిపారు. జూలై నెలాఖారులోగా మొత్తం సర్వే ప్రక్రియ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పకడ్బందీగా పూర్తి చేయిస్తామని, కోడంగల్ మున్సిపల్ పరిధిలో నక్ష కార్యక్రమం కింద 12 వార్డ్స్ కు గాను 7 వార్డ్స్ పూర్తి చేసి 121 బ్లాక్ లు పూర్తి అయ్యాయని, లాగిన్ లు పంపించామని ,మిగతా వాటిని ప్రతి ఒక్క ఇంటి సరి హద్దులు, ప్రభుత్వ, ప్రైవేటు భవనాలు, ఇతర ఖాళీ స్థలాల విస్తీర్ణం వివరాలు పకడ్బందీగా పూర్తి చేయిస్తామని కలెక్టర్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్సు లో కోడంగల్ మున్సిపల్







కమిషనర్ బలరాం నాయక్, వేణుగోపాల్ ఉన్నారు.

# రైతులకు ఎరువులు, విత్తనాలు విక్రయంపై డీలర్లు పారదర్శకంగా ఉండాలి

## జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఐఏఎస్

**వికారాబాద్ జూన్,08 :** రైతులకు ఎరువులు, విత్తనాలు విక్రయంపై డీలర్లు పారదర్శకంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ తెలిపారు. వానకాలం సీజన్ కు సంబంధించి ఎరువులు, విత్తనాల విక్రయాలపై క్రమబద్ధీకరణ, నియంత్రణపై సంబంధిత డీలర్లు, వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ...జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు, విత్తనాలను విక్రయించాలన్నారు. ప్రభుత్వం సూచించిన ధరలకు అనుగుణంగా మాత్రమే విక్రయించాలని ఆయన తెలిపారు. ఎవరైనా డీలర్లు అక్రమాలకు పాల్పడినట్లయితే చట్టరీత్యా తీసుకోవడం జారుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు. నకిలీ విత్తనాలు, బ్లాక్ మార్కెట్లలో విత్తనాలు, నిషేధిత విత్తనాలు విక్రయించినట్లయితే అలాంటి వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. జిల్లాలో టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అవకతవకలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదుచేసి చర్యలు తీసుకొని జరుగుతుందని ఆయన తెలిపారు. లైసెన్స్ లేకుండా ఎరువులు, విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం సన్న రకం బియ్యాన్ని పండించేందుకు రైతులను ప్రోత్సహించడం జరుగుతుందని, ఆ దిశగా రైతులను ప్రోత్సహించాలని డీలర్లకు, అధికారులకు కలెక్టర్ సూచించారు. సన్న రకం










వరిని సాగుచేసిన వారికి 500 రూపాయలు బోనస్ చెల్లించడం జరుగుతుందని, ఇట్టి విషయంపై రైతుల్లో అవగాహన కల్పించి జిల్లాలో 50 శాతం సన్నరకం వరిని సాగు చేసే విధంగా వారిని ప్రోత్సహించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా ఎస్పీ స్నేహమేహర మాట్లాడుతూ...దేశానికి అన్నం పెట్టే అమాయక రైతులను మోసం చేయడం సరైంది కాదనన్నారు. 70 శాతం రైతులు వ్యవసాయంపై ఆధారపడి తమ కుటుంబాలను పోషించుకుంటారని వారి సంక్షేమాన్ని కోరుకోవడం మన అందరి బాధ్యత అని ఆమె అన్నారు. నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయించిన వారిని గుర్తించేందుకు టాస్క్ ఫోర్స్ బృందాలను నియమించడం జరిగిందని, అవకతవకలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆమె అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె.వెంకటాచారి, జిల్లా వ్యవసాయ అధికారి రాజా రత్నం, వ్యవసాయ సహాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# "బడిబాట" గీతం ఆవిష్కరణ

## విద్యా వెలుగుల వైపు మరో ముందడుగు

**కరీం నగర్, జూన్8 :** జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రతి చిన్నారి పాఠశాల బాట పట్టాలని, ప్రతి గ్రామం విద్యా వికాసానికి నిలయంగా మారాలని సంకల్పంతో రూపొందించిన "బడిబాట" ప్రచార గీతాన్ని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డా. అశ్విని తనాజీ వాకడే పాల్గొన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి శ్ఎన్. ప్రశాంత్ రెడ్డి గీతాన్ని కలెక్టర్ గారికి సమర్పించారు. ఈ గీతం కేవలం ఒక పాట కాదు; ప్రభుత్వ పాఠశాలల పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించే ఒక విద్యా ఉద్యమం. ప్రతి బాలబాలికను బడిలో చేర్పించి, నాణ్యమైన విద్య అందించాలనే సందేశాన్ని ఈ గీతం హృదయాలకు చేరవేస్తుంది. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తలు గా అశోక్ రెడ్డి , శ్రీనివాస్ వ్యవహరించారు. జడ్పీహెచ్ఎస్ ఒద్యారం పాఠశాలకు చెందిన పదవీ విరమణ పొందిన మాజీ మండల విద్యాధికారి శనిగు ప్రభాకర్ రావు కె.బి. శర్మ గరచయిత వెంకటేశ్వర్లు కృషితో ఈ గీతం రూపొందించబ డింది. "ప్రతి ఇంటి నుండి ఒక అడుగు బడివైపు... ప్రతి గ్రామం నుండి ఒక అడుగు విద్యావైపు..." అనే సందేశంతో రూపొందిన ఈ గీతం జిల్లా వ్యాప్తంగా బడిబాట కార్యక్రమానికి స్ఫూర్తినిస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచడంలో కీలక పాత్ర పోషించనుంది. "విద్యే శక్తి... విద్యే భవిష్యత్తు... బడిబాటే ఆ భవిష్యత్తుకు బంగారు బాట" అనే సందేశంతో జిల్లాలోని తల్లిదండ్రులు, ప్రజలు ప్రభుత్వ పాఠశా లలను ఆదరించి, తమ పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని విద్యాశాఖ పిలుపునిచ్చింది. స్లోగన్:"ప్రతి బిడ్డ బడిలోకి... ప్రతి కుటుంబం అభివృద్ధి వైపు!"

# ఎబోలా వైరస్‌పై అప్రమత్తంగా తెలంగాణ ప్రభుత్వం

## విమానాశ్రయంలో కట్టుదిట్టమైన నిఘా -- అనుమానితుల పరీక్షల్లో నెగిటివ్

**హైదరాబాద్ జూన్8 :** డెమోక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాల్లో ఎబోలా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. రాష్ట్రంలో చేపట్టిన ముందస్తు జాగ్రత్తలు, పర్యవేక్షణ చర్యలపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సోమవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై శంషాబాద్ విమానాశ్రయంలో ప్రత్యేక నిఘా కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ప్రయాణికుల ఆరోగ్య పరిస్థితిని 21 రోజులపాటు పర్యవేక్షిస్తూ, అనుమానితులను గాంధీ ఆస్పత్రిలో ఐసోలేషన్‌లో ఉ ంచుతున్నట్లు వెల్లడించారు. ఇప్పటివరకు ఇద్దరు అనుమానితుల నమూనాలను పూణెలోని వైరాలజీ సంస్థకు పంపగా, తొలి పరీక్షల్లో వైరస్ నెగిటివ్‌గా తేలిందన్నారు. రెండోసారి పరీక్షల కోసం నమూనాలు పంపినట్లు తెలిపారు. తప్పుడు చిరునామాలు, వివరాలు ఇచ్చే ప్రయాణికులపై ఎపిడెమిక్ డిసీజెస్ చట్టం కింద కేసులు నమోదు చేయాలని మంత్రి ఆదేశించారు. ఫ్రెంచ్, అరబిక్, స్వాహిలి భాషల్లో సమాచార సేకరణ కోసం ప్రత్యేక సిబ్బందిని నియమించాలని సూచించారు. రాష్ట్రంలో ఎబోలా నివారణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నాయని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. అధికారిక సమాచారాన్నే విశ్వసించాలని ప్రజలకు సూచించారు.

# ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం. చైర్ పర్సన్ నీరజ

## పాల్గొన్న కమిషనర్ పీ.రాకేష్ రెడ్డి,అధికారులు, కౌన్సిలర్లు



**తాండూరు మున్సిపల్, జూన్,08 :** వార్డు సభల ద్వారా వచ్చిన సమస్యలను సంబంధిత అధికారులకు పంపించి పరిష్కరిస్తామని తాండూరు మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోలనీరజ చెప్పారు. సోమవారం నిర్వహించిన వాడు సభలో ఆమె పాల్గొని ప్రసంగించారు. తాండూరు పట్టణంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రణాళికల సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించడం జరిగిందని ఆమె వెల్లడించారు. ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ప్రభుత్వ వార్డు సభలు నిర్వహిస్తుందని కమిషనర్ పి రాకేష్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ, కౌన్సిలర్లు నారా శ్రీలత, సుప్రీత పాటిల్,ఎల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఐఏఎస్



**నారాయణపేట, జూన్,08 :** నారాయణపేట: ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక తెలి పారు. సోమవారం జిల్లా కలెక్టర్ చాంబర్లో ఈనెల 14న నారాయణపేటలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరం సంబంధించిన పోస్టర్ ను విడుదల చేశారు. మోహాశిన్ ఏ ఆజం ఫౌండేషన్ మహబూబ్ నగర్ శాఖ శంకర ఐ హాస్పిటల్ హైదరాబాద్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 14న పట్టణంలోని గ్రీన్ వుడ్ స్కూల్ ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించి కంటి శుక్లాల ఉచిత ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ తరపున అబ్దుల్ రహీం మహమ్మద్ మునీర్ మహమ్మద్ సాజిద్ సద్రుద్దీన్ చాంద్ తదితరులు పాల్గొన్నారు.

చురకలు

మంగళవారం 9 జూన్ 2026

# పీఎం డీ డీ కే వై పథకం వార్షిక ప్రణాళికపై కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక ఐఏఎస్ సమీక్ష




**నారాయణపేట జూన్,08 :** పీఎం ధన్ ధాన్య కృషి యోజన పథకం వార్షిక ప్రణాళికపై సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..... సహజ మరియు సేంద్రీయ వ్యవసాయాన్ని విస్తరించడం మరియు రైతుల ఆదాయాలు మరియు గ్రామీణ జీవనోపాధికి మద్దతు ఇస్తూ స్థిరమైన వాతావరణ స్థితిస్థాపక వ్యవసాయాన్ని స్వీకరించడమే పథకం ఉద్దేశ్యం అన్నారు. అయితే జిల్లాలో ఆ పథకం అమలుకు సంబంధిత శాఖల అధికారులు తమ తమ శాఖలకు సంబంధించిన వార్షిక ప్రణాళికను అమలు చేసేందుకు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. వార్షిక ప్రణాళిక అమలులో ఇన్నోవేటివ్ ఉండాలన్నారు. అంతకు ముందు ఆ పథకం నోడల్ అధికారి సాయిబాబా మాట్లాడుతూ..దేశంలోని 100 జిల్లాలలో నారాయణపేట జిల్లా ఈ పథకం కింద ఎంపిక కావడం ఈ ప్రాంత అభివృద్ధికి శుభ పరిణామం అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఈ పథకం కింద ఎంపికైన నాలుగు జిల్లాలలో ఉమ్మడి పాలమూరు జిల్లాలో నే మూడు జిల్లాలు నాగర్ కర్నూల్, గద్వాల, నారాయణపేట ఎంపిక కావడం జరిగిందని ఆయన క్లుప్తంగా వివరించారు. గత జనవరి 3, 4, న జాయింట్ సెక్రెటరీ మినిస్ట్రీ ఆఫ్ కో ఆపరేషన్/పీఎండిడికేవై సెంట్రల్ నోడల్ అధికారి రమణ్ కుమార్ నారాయణ పేట జిల్లాలో పర్యటించి పథకం అమలు తీరును పర్యవేక్షించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డి ఆర్ డి ఓ వెంకట్ రాములు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్, జిల్లా మత్స్య శాఖ అధికారి రెహమాన్, డిపివో సుధాకర్ రెడ్డి, ఎల్ డీ ఎం విజయ్ కుమార్, నాబార్డు అధికారి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మహమ్మదాబాద్ గ్రామములో శంకరా కంటి ఆసుపత్రి ద్వారా ఉచిత కంటి శిబిరం ఏర్పాటు

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న గ్రామ సర్పంచ్ రామ్ లాల్,





**మహమ్మదాబాద్ మండలం, జూన్ 08 :** మహమ్మదాబాద్ గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం శంకరా కంటి ఆసుపత్రి ద్వారా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మహ్మదాబాద్ గ్రామ సర్పంచ్ రామ్ లాల్ పాల్గొని ప్రతి ఒక్కరికి చూపు రావాలని అదే మా లక్ష్యం అని ఆయన అన్నారు. హైదరాబాద్ లో ఉన్న ప్రముఖ శంకర కంటి ఆసుపత్రి కలిసి తమ గ్రామ గ్రామానికి సేవ చేయాలనే దృకృథంతో మహమ్మదాబాద్ వాసి రాహత్ శంకర ఆసుపత్రి వాళ్లతో మాట్లాడి తమ గ్రామానికి క్యాంప్ పెట్టాలని కోరి ఈ ఈ క్యాంపు నిర్వహించడం అభినందనీయం ఇలాంటి క్యాంప్ లో మరిన్ని చేయాలని కోరారు ఈ క్యాంపులో మాజీ ఎంపీపీ శాంతి రంగయ్య కోఆప్షన్ మెంబర్ మాజీ రహీం డాక్టర్. వందన కోఆర్డినేటర్ శివ రంగ రహత్ అలీ పాల్గొనున్నారు

## టెక్నాలజీతో పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలి: డీజీపీ సి.వి. ఆనంద్

**హైదరాబాద్, జూన్ 8 :** రాష్ట్ర పోలీస్ శాఖ సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో దేశంలోనే ముందంజలో ఉన్నప్పటికీ, అందుబాటులో ఉన్న డిజిటల్ వ్యవస్థలను పూర్తిస్థాయిలో వినియోగించకపోవడం వల్ల కొన్ని అంశాల్లో వెనుకబాటుతనం ఏర్పడిందని డీజీపీ సి.వి. ఆనంద్ అన్నారు. డీజీపీ కార్యాలయంలో జిల్లా ఎస్హెచ్‌ఓలు, యూనిట్ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. డేటా ఆధారిత పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని, టీజీ కాప్ యాప్‌లు, సీసీటీఎన్ఎస్, ఎస్సీఆర్‌బీ వంటి డిజిటల్ వ్యవస్థలను సమర్థంగా వినియోగించాలని సూచించారు. ఎఫ్ఐఆర్‌లు, అరెస్టులు, చార్జ్‌షీట్లు, డిజిటల్ సాక్ష్యాల వివరాలను సకాలంలో నమోదు చేయాలని ఆదేశించారు. పోలీస్ శాఖలో సాంకేతిక సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక టెక్నికల్ టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. డిజిటల్ ఫోరెన్సిక్స్, రియల్ టైమ్ మానిటరింగ్, డేటా విశ్లేషణ ద్వారా నేర దర్యాప్తు వేగవంతమై, నాణ్యత పెరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర పోలీస్ శాఖను మళ్లీ దేశంలో అగ్రస్థానంలో నిలిపేందుకు సాంకేతిక వ్యవస్థల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.

## వి.వి.పాలెంలో రూ.1.27 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి తుమ్మల శ్రీకారం



**ఖమ్మం జూన్8 :** రఘునాథపాలెం మండలం వి.వి.పాలెం గ్రామంలో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రూ.97 లక్షల సుడా నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి, రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన పశు వైద్యశాల భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాభివృద్ధి పనులను భావితరాలకు ఉపయోగపడేలా నాణ్యతతో చేపట్టాలని సూచించారు. గ్రామ పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని, పేదలకు గృహ స్థలాల కోసం భూమిని గుర్తించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా పశు వైద్యశాల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మాట్లాడుతూ పశు వైద్యశాల భవనం రైతులకు, పశుపోషకులకు మెరుగైన సేవలు అందించడంలో కీలకంగా నిలుస్తుందని తెలిపారు. రైతులు వరికి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు.

# జూన్ 21న జరిగే నీట్ పునః పరీక్షను సజావుగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టాలి

### సంబంధిత అధికారులను ఆదేశించిన కలెక్టర్ దీపక్ తివారి ఐఏఎస్




**వికారాబాద్ జూన్,08 :** జూన్ 21న జరిగే నీట్ పునః పరీక్షను సజావుగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో జూన్ 21న నిర్వహించే నీట్ పునః పరీక్ష కు సంబంధించి వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులనుద్దేశించి జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ...జూన్ 21న నిర్వహించే నీట్ పునః పరీక్షను ఏటిఏ ( నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ) మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టాలన్నారు. అందుకు అనుగుణంగా జిల్లాలోని (5) పరీక్షల కేంద్రాల్లో నీట్ పునః పరీక్ష ఉంటుందని ఆయన తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5-15 గంటల వరకు పరీక్ష జరుగుతుందని అదేవిధంగా వైకల్యం ఉన్న వ్యక్తులకు మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 6-15 గంటల వరకు పరీక్ష ఉంటుందని ఆయన తెలిపారు. సాంఘీక సంక్షేమ బాలికల కళాశాల, కొత్తగడి లో 384,సాంఘీక సంక్షేమ బాలల కళాశాల, అనంతగిరిపల్లి లో 312, వికారాబాద్ జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో 240, సంఘం లక్ష్మీబాయి బాలిక గురుకుల కళాశాలలో 240, తాండూర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 120 మొత్తం జిల్లాలో 1296 మంది నీట్ పరీక్షకు హాజరు కానున్నట్లు కలెక్టర్ తెలిపారు. నీట్ పునః పరీక్షను ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని, ప్రధానమంత్రి స్వయంగా పరీక్షా తీరును పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇలాంటి తప్పిదాలు జరగకుండా బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా విధులను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాల్లో ముందస్తుగానే అన్ని సౌకర్యాలను సమకూర్చుకోవాలని ఆయన తెలిపారు. జూన్ 20, 21వ తేదీల్లో నిరంతర విద్యుత్ సౌకర్యం కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రంలో జనరేటర్ ను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. పరీక్ష కేంద్రంలో ఫ్యాన్లు, తాగునీరు, మంచి లైటింగ్ లతోపాటు మహిళలకు ప్రత్యేకమైన టాయిలెట్ ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రం నుండి లైవ్ టెలికాస్ట్ ఉంటుందని, లైవ్ టెలికాస్ట్ ను కలెక్టరేట్ నుండి వీక్షించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలను ఏజెన్సీల ద్వారా అమర్చాలని, పరీక్ష కేంద్రం లోకి బయట వ్యక్తులు ప్రవేశించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అధికారులు సూచించారు. పరీక్ష సమయానికి అనుగుణంగా బస్సు సౌకర్యాలు కల్పించాలని అదేవిధంగా పరీక్ష పూర్తి అయిన తర్వాత సాయంత్రం కూడా బస్సులను సమకూర్చాలని కలెక్టర్ సంబంధిత అధికారికి సూచించారు. ప్రతి పరీక్ష కేంద్రంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ను కలెక్టర్ ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద అత్యవసర వైద్య సిబ్బంది,అత్యవసర మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా అంబులెన్స్, పై సర్వీస్ ను కూడా సమకూర్చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ స్నేహమేహర మాట్లాడుతూ... పరీక్షలు హాజవుగా జరిగేలా పోలీస్ శాఖ తరపున పూర్తి సహకారం ఉంటుందన్నారు. ఎలాంటి తప్పులు జరగకుండా ముందస్తుగానే ప్రతి ఒక్కటి చూసుకోవాలని సమస్య ఉంటే సరి చేసుకోవాలని ఆమె సూచించారు. ప్రతి పరీక్ష కేంద్రానికి పోలీస్ అధికారి నియమించడంతోపాటు పరీక్ష పూర్తయ్యాక సాయంత్రం 7 గంటల వరకు పోలీస్ బందోబస్తు ఉంటుందని ఆమె తెలిపారు. ఎస్కాట్ బృందాలను ఏర్పాటుచేసి పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా జాగ్రత్తలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఉమా శంకర్ ప్రసాద్, జిల్లా విద్యాధికారి మహమ్మద్ అబ్దుల్ ఘని, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ నెహమత్ అలీ, నీట్ సిటీ కోఆర్డినేటర్ కే.సాయి లత, చీఫ్ సూపరింటెండెంట్ లు డి.రమాదేవి, వి.యాదయ్య , ఎం.శ్రీశైలం, సి.రాజు, పి.వేణుగోపాల్ రెడ్డి, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా ప్రయాణించాలి

- ట్రాఫిక్ ఎస్సై కృష్ణ చైతన్య



**నారాయణపేట, జూన్,08 :** ప్రజల ప్రాణ భద్రతే ప్రధాన లక్ష్యంగా నారాయణపేట జిల్లా ట్రాఫిక్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వాహనదారులు,ఆటో డ్రైవర్లు మరియు సాధారణ ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై కృష్ణ చైతన్య మాట్లాడుతూ... వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించే వారు సీటు బెల్ట్ ధరించాలని తెలిపారు. అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి చర్యలు ప్రమాదాలకు ప్రధాన కారణమవుతున్నాయని పేర్కొన్నారు. ఆటో రిక్షాలలో అనుమతించిన సంఖ్య కంటే ఎక్కువ మంది ప్రయాణికులను ఎక్కించకూడదని హెచ్చరించారు. ముఖ్యంగా ప్రస్తుత వర్షాకాలంలో అధిక సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించడం వల్ల వాహన సమతుల్యత దెబ్బతిని ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఆటో డ్రైవర్లు రవాణా నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. వర్షాకాలంలో ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఉరుములు, మెరుపులు సంభవించే సమయంలో చెట్ల కింద నిలబడటం లేదా ఆశ్రయం పొందడం ప్రమాదకరమని తెలిపారు. పిడుగుపాటుకు గురయ్యే అవకాశం ఉన్నందున వర్షం పడుతున్న సమయంలో చెట్ల కింద నిలబడకుండా సురక్షితమైన ప్రదేశాల్లో ఉండాలని సూచించారు. అలాగే విద్యుత్ తీగలు, కరెంట్ స్తంభాలు లేదా తెగిపోయిన విద్యుత్ వైర్ల సమీపంలో ఉండరాదని హెచ్చరించారు. వర్షాల కారణంగా విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున అనుమానాస్పద పరిస్థితులు కనిపిస్తే వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో వాహనాలను నెమ్మదిగా నడపాలని, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని, ట్రాఫిక్ సిగ్నల్స్ మరియు రోడ్డు భద్రతా సూచికలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, వర్షాకాలంలో అప్రమత్తంగా వ్యవహరిస్తే ప్రమాదాలను నివారించవచ్చని ట్రాఫిక్ ఎస్సై కృష్ణ చైతన్య తెలిపారు.

# కంజర్ల విజయలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు విజయలక్ష్మి మాతృ శక్తి శ్రీమంత కానుక





### ఫౌండేషన్ చేర్మెన్ విజయక్క

### దేవనూర్ సర్పంచ్ రేణుక కిషన్ రావు

**యాలాల మండలం, జూన్,08**

మండలం పరిధిలోని దేవనూర్ గ్రామంలో కంజర్ల విజయలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు "విజయలక్ష్మి మాతృ శక్తి శ్రీమంత కానుక పేరుతో కిట్టు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో గడపకు చేరుకుని గర్భిణీ స్త్రీలకు చీరలు,సారెలు అవసరమైన వస్తువులతో కూడిన కానుకలను సోదరీభావంతో అందజేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధి కంజర్ల విజయలక్ష్మి యాదవ్ పాల్గొని గర్భిణీ స్త్రీలకు సీమంత కానుక అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గర్భిణీ స్త్రీల ఆరోగ్యం,శిశు సంక్షేమం ప్రతి కుటుంబానికి ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణీలకు అవసరమైన సహాయం అందించేందుకు ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈ సేవా కార్యక్రమాన్ని దేవనూర్ సర్పంచ్ రేణుక కిషన్ రావు, వికారాబాద్ జిల్లా మాజీ కోఆప్షన్ మెంబర్ అక్బర్ బాబా,మాజీ ఎంపీటీసీ మంత్రి వెంకటయ్య, వార్డు సభ్యులు ,మెట్లీ కృష్ణ స్థానిక మహిళలు గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో దేవనూర్ గ్రామ పెద్దలు,ఆశ కార్యకర్తలు సభ్యులు,అంగన్వాడి టీచర్ ఫౌండేషన్ క్రాంతి అనిల్ కుమార్ గౌడ్ ప్రకాష్ గౌడ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# సుదీర్ఘ రాజకీయ అనుభవశాలి ఆచార్య ఎన్జీ రంగా

**60 ఏళ్ల పాటు రైతుల పక్షాన పోరాడిన ప్రజాప్రతినిధి**

**భారత రైతాంగ ఉద్యమపితగా, సుదీర్ఘ పార్లమెంటేరియన్‌గా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి ఎక్కిన మహనీయుడు**

**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రోశయ్యలకు రాజకీయ గురువు**

## నేడు ఆచార్య ఎన్జీ రంగా వర్ధంతి..

గోగినేని రంగనాయకులు.. ఈ పేరు చెపితే దేశంలో గుర్తు పట్టే వారు దాదాపు ఉండకపోవచ్చు కానీ, ఆచార్య ఎన్.జి.రంగా అంటే తెలియని వారుండరు. ఆయన ఒక నిబద్ధత కలిగిన పాతతరం రాజకీయ నాయకుడు మరియు భారత రైతాంగ ఉద్యమపిత. లోక్‌సభలోనూ, రాజ్యసభలోనూ సుమారు 60 ఏళ్ల పాటు రైతుల పక్షాన పోరాడిన రంగా, సుదీర్ఘ పార్లమెంటేరియన్‌గా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి ఎక్కారు. 1900 నవంబరు 7న గుంటూరు జిల్లా నిడుబ్రోలులో గోగినేని నాగయ్య, అచ్చమాంబ దంపతులకు జన్మించిన రంగా, గుంటూరు ఆంధ్రా క్రిష్టియన్ కళాశాల నుండి పట్టభద్రులయ్యారు. 1924లో భారతీ దేవితో ఆయన వివాహం జరిగింది. ఆ తర్వాత 1926లో ఇంగ్లాండ్‌లోని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం నుండి ఆర్థిక శాస్త్రంలో బి.లిట్ పొంది భారతదేశానికి తిరిగి వచ్చి, మద్రాసులోని పచ్చయప్ప కళాశాలలో ఆర్థిక శాస్త్రాచార్యుడిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. ఆ సమయంలో తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి అన్నాదొరై ఆయనకు విద్యార్థిగా ఉండటం విశేషం.

ప్రధానంగా హేతువాది అయిన ఆచార్య రంగా, 1930లో మహాత్మా గాంధీ పిలుపుకు స్పందించి భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. 1933లో రైతు కూలీ ఉద్యమానికి నేతృత్వం వహించి, కిసాన్ కాంగ్రెస్ పార్టీని స్థాపించారు. రైతుకూలీల పరిస్థితిపై గాంధీతో జరిపిన చారిత్రాత్మక చర్చల ముఖ్యాంశాలపై "బాపు దీవెనలు" అన్న పుస్తకాన్ని వెలువరించారు. ఆంధ్రలో తొలిసారి రాజకీయ పాఠశాలలను ప్రారంభించిన ఖ్యాతి రంగాదే. నిడుబ్రోలులో ఆయన స్థాపించిన 'రామనీడు రాజకీయ విద్యాలయాన్ని' 1933లో మహాత్మాగాంధీ ప్రారంభించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు, కొణిజేటి రోశయ్య కూడా రంగా శిష్యులే కావడం గమనార్హం. ఈ పాఠశాలలో తొలినాళ్లలో పుచ్చలపల్లి సుందరయ్యతో సహా కొందరు కమ్యూనిస్టులు కూడా పాల్గొన్నారు. రంగా ఆంగ్లంలోనూ, తెలుగులోనూ మంచి రచయితగా రాణిస్తూ 'హరిజన నాయకుడు' అనే నవల రాశారు. 1937 నుంచి 'వాహిని' అనే పత్రికను నడిపిన ఆయన, 1938 నాటికే ఇందూలాల్ యాగ్నిక్‌తో కలిసి కిసాన్ సభలు నిర్వహించారు.

స్వాతంత్ర్య పోరాటంలో నిర్విరామంగా పాల్గొని అనేక పర్యాయాలు జైలు పాలైన రంగా, జైళ్లలో కూడా రాజకీయ ఖైదీలకు పాఠశాలలు నిర్వహించారు. ఆంధ్ర రాజకీయాలలో టంగుటూరి ప్రకాశం పంతులుతో కలిసి కీలక పాత్ర వహించిన రంగా పిలుపునందుకుని గౌతు లచ్చన్న, పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి, కందుల ఓబుల రెడ్డి, చేగిరెడ్డి బాలిరెడ్డి, ఎన్.వి. నాయుడు, నీరుకొండ రామారావు, బీశెట్టి అప్పారావు, పి.రాజగోపాల నాయుడు వంటి ఎందరో నాయకులు రాజకీయాలలో ప్రవేశించారు. రంగా అంతర్జాతీయ వ్యవసాయ ఉత్పత్తిదారుల సమాఖ్య వ్యవస్థాపకులలో ఒకరిగా ఉంటూ, ప్రపంచవ్యాప్తంగా జరిగిన పలు అంతర్జాతీయ సదస్సులలో భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించి రైతు సమస్యలను ప్రపంచ దృష్టికి తీసుకెళ్లారు. రైతులు విప్లవోద్యమాలలో నిర్వహించిన పాత్రను అధ్యయనం చేసి 'రివల్యూషనరీ పెజంట్స్', 'ది క్రెడో ఆఫ్ వరల్డ్ పెజంట్స్' అనే గ్రంథాలు రాశారు.

జాతీయ నాయకులలో అంబేద్కర్‌తో రంగాకు ఎంతో సాన్నిహిత్యం ఉండేది. రాజ్యాంగ సభకు అంబేద్కర్ పేరును ప్రతిపాదించడంలో ఆయన కీలకపాత్ర వహించారు. స్వాతంత్ర్యానంతరం నెహ్రూ ప్రతిపాదించిన సహకార వ్యవసాయాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చి కృషీకార్ లోక్ పార్టీని, ఆ తర్వాత రాజాజీతో కలిసి స్వతంత్ర పార్టీని స్థాపించారు. రంగా అధ్యక్షతన స్వతంత్ర పార్టీ 1962 ఎన్నికలలో 25 స్థానాలు గెలిచి బలమైన ప్రతిపక్షంగా నిలిచింది. ఆ తర్వాత 1972లో ఆయన తిరిగి కాంగ్రెస్ (ఐ)లో చేరి ఇందిరా గాంధీకి సన్నిహితుడిగా కొనసాగారు. 1935లో తొలిసారి కేంద్ర శాసనసభకు ఎంపికైన రంగా, ఆ తర్వాత తెనాలి, చిత్తూరు, శ్రీకాకుళం, గుంటూరు నియోజకవర్గాల నుండి పలుమార్లు లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎలాంటి పదవుల ఆశ లేకుండా, నీతివంతమైన రాజకీయాన్ని పాటించిన ఆచార్య రంగా, తన 95వ ఏట అనారోగ్యంతో 1995 జూన్ 9వ తేదీన నిడుబ్రోలులోని ఆయన స్వగృహమైన 'గోభూమి'లో తుది శ్వాస విడిచారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# 64 వసంతాల గుండమ్మ కథ

- చిత్రరాజం వెనుక ఎన్నో ఆసక్తికర విశేషాలు!
- సినీ చరిత్రలో నిలిచిన అద్భుత మల్టీస్టారర్
- సూర్యకాంతం పాత్రే సినిమా పేరుగా వైవిధ్యం
- షేక్‌స్పియర్ నాటకం ఆధారంగా చక్రపాణి స్క్రిప్ట్.. డేట్స్ అడ్జస్ట్‌మెంట్‌తో షూటింగ్
- విమర్శలను తిప్పికొట్టి రికార్డు కలెక్షన్లు సాధించిన విజయా ప్రొడక్షన్స్ చిత్రం




తెలుగు ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేసి, నాటి, నేటి తరాల సినిమా ప్రేక్షకుల ఆదరాన్ని చూరగొన్న అలనాటి అద్భుత చిత్రరాజం 'గుండమ్మ కథ'. తెలుగు చిత్ర సీమలో క్షణం తీరిక దొరకని అగ్రశ్రేణి నటులతో నిర్మించిన ఘనమైన మల్టీ స్టారర్ సినిమా అది. 1962 జూన్ 7న విడుదలై నేటికి 64 వసంతాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం నిర్మాణం వెనక ఎన్నో ఆసక్తికరమైన విశేషాలు దాగి ఉన్నాయి. ఎన్టీఆర్, ఏఎన్నార్ లాంటి అగ్ర శ్రేణి హీరోలు ఉన్నా, "గుండమ్మ కథ" అని సూర్యకాంతం పాత్ర పేరుమీద సినిమా పేరు పెట్టడమే ఈ చిత్రానికి ఉన్న అతిపెద్ద వైవిధ్యం. జానపద బ్రహ్మగా పేరొందిన విఠలాచార్య కన్నడంలో "మనె తుంబిద హెణ్ణు" పేరిట ఒక కుటుంబ కథాచిత్రాన్ని ముందుగా నిర్మించారు. ఆ చిత్ర నిర్మాణానికి వాహినీ స్టూడియోస్ అధినేత బి.నాగిరెడ్డి సహకారం అందించడంతో, ఆ కృతజ్ఞతతో సినిమా హక్కులను విఠలాచార్య ఆయనకే ఇచ్చేశారు. ఇందులో గుండమ్మ కుటుంబ వ్యవహారాలు నాటకీయంగా సాగుతూ నాగిరెడ్డికి ఎంతో తమాషాగా అనిపించాయి. దాంతో విజయా ప్రొడక్షన్స్ చరిత్రలోనే తొలిసారి ఓ రీమేక్ సినిమా చేసేందుకు ఆయన సిద్ధపడ్డారు.

కథలో చిన్న చిన్న మార్పులు చేసి డి.వి.నరసరాజుతో ట్రీట్మెంట్, మాటలు రాయించారు నాగిరెడ్డి. మొదట ఈ సినిమాకు దర్శకునిగా నాగిరెడ్డి సోదరుడు బి.న్.రెడ్డిని అనుకున్నారు. అయితే బి.ఎన్.రెడ్డి కళాత్మక చిత్రాల తరహా దర్శకుడు కావడమూ, ఇది ఆయన శైలి సినిమా కాకపోవడంతో వేరే దర్శకుడితో చేయాలని నిర్ణయించారు. ఆ తర్వాత పి.పుల్లయ్యకు నరసరాజు సిద్ధం చేసిన డైలాగ్ వెర్షన్ పంపగా, ఆయనకు ఈ కథ, ట్రీట్మెంట్ నచ్చకపోవడంతో ప్రాజెక్టు నుంచి తప్పుకున్నారు. దాంతో సినిమా నిర్మాణం మళ్ళీ వెనుక బడింది. ఈ తరుణంలో నాగిరెడ్డి ఆ స్క్రిప్ట్‌ను తన సన్నిహితుడు, సహ నిర్మాత, రచయిత అయిన చక్రపాణికి ఇచ్చారు. ఎలాగైనా సినిమా తీయాలనే పట్టుదలతో ఉన్న చక్రపాణి మొత్తం స్క్రిప్టును తిరగరాశారు. విలియం షేక్‌స్పియర్ రాసిన ప్రసిద్ధ నాటకం "ద టేమింగ్ ఆఫ్ ద ష్రూ" లోని కథానాయికల పాత్రలను, వారి స్వభావాలను ఆధారంగా చేసుకుని చక్రపాణి కథను సరికొత్తగా మలిచారు.

ఈ సినిమాకు దర్శకునిగా చివరకు కమలాకర కామేశ్వరరావుని ఎంచుకున్నారు. చక్రపాణి, కమలాకర కామేశ్వరరావు, డి.వి.నరసరాజుల మధ్య జరిగిన కథా చర్చల్లో భాగంగా అప్పటివరకూ ఉన్న గుండమ్మ భర్త పాత్రను?... తొలగించి, గుండమ్మను వితంతువుగా చూపించాలని నిర్ణయించారు. గుండమ్మ అనేది నిజానికి తెలుగు పేరు కాదు, కన్నడ మాతృకలోని ఆ పాత్ర పేరునే ఇక్కడా ఖరారు చేస్తూ, పెడితే అదే తెలుగు పేరు అవుతుందని చక్రపాణి ఆ పేరనే ఉంచేశారు. సినిమాలో నటించిన ఇద్దరు కథానాయకులు ఎన్టీఆర్, ఏఎన్నార్ అప్పటికే టాలీవుడ్‌లో టాప్ హీరోలు కావడంతో సినిమా విడుదల సమయంలో టైటిల్స్ లో ఎవరి పేరు ముందు వేయాలనే సందేహం వచ్చింది. దీనికి పరిష్కార మార్గంగా అసలు తెరపై పేర్లే వేయకుండా కేవలం ఫోటోలు చూపించాలని నిర్ణయించుకున్నారు. మొదట ఎన్టీ రామారావు, నాగేశ్వరరావు, సావిత్రి, జమున, ఎస్వీ రంగారావుల ఫోటోలు ఒకేసారి తెరపై వేసి, ఆ తర్వాత సూర్యకాంతం, ఛాయాదేవి, రమణారెడ్డి, హరనాథ్, ఎల్.విజయలక్ష్మిల ఫోటోలు ఒకేసారి వేశారు.

ఈ చిత్రంలోని నటీనటులంతా పరిశ్రమలో అత్యంత బిజీగా ఉండటం వల్ల వాళ్ళ డేట్స్ కలవడం కష్టమయ్యేది. అందుకోసం వాహినీ స్టూడియోలో గుండమ్మ ఇంటి సెట్ శాశ్వతంగా వేసి ఉంచారు. రోజూ ఉదయం చక్రపాణి నటులందరికీ ఫోన్ చేసి ఆరోజు వారి షెడ్యూల్ కనుక్కుని, అందుబాటులో ఉన్న నటుల కాంబినేషన్ సీన్లను షూట్ చేసేవారు. సినిమాలో సూపర్ హిట్ అయిన "కోలో కోలోయన్న" పాటలో ఎన్టీఆర్–సావిత్రి, ఏఎన్నార్–జమున జంటలు పక్కపక్కనే ఉండి పాడుకుంటున్నట్టు చూపించినప్పటికీ, ఆ నలుగురు ఒకేసారి కలిసి షూటింగ్‌లో పాల్గొనలేదు. ఎవరికి ఎప్పుడు ఖాళీ ఉంటే వారితో అప్పుడు విడివిడిగా షూట్ చేసి ఎడిటింగ్‌లో ఆ తేడాలు తెలియకుండా జాగ్రత్తపడ్డారు.

సినిమా విడుదలకు పదిరోజుల సమయం ఉందనగా ఎల్వీ ప్రసాద్ ఇంట్లో జరిగిన పెళ్ళి వేడుకల్లో గుండమ్మ కథను ప్రదర్శించగా, సినీ రంగ ప్రముఖులు పలువురు విమర్శనాస్త్రాలు సంధించారు. అయితే జూన్ 7, 1962న విడుదలైన ఈ చిత్రం అద్భుతమైన కూర్పుతో, హౌస్ ఫుల్ కలెక్షన్లతో నడిచి సదరు విమర్శలన్నింటినీ తిప్పికొట్టి రికార్డు సృష్టించింది. ఈ చిత్రంలోని 'ఎంత హాయి ఈ రేయి', 'కోలోకోలో యన్నకోలో', 'ప్రేమయాత్రలకు బృందావనము', 'మౌనముగా నీ మనసు పాడిన', 'లేచింది నిద్ర లేచింది మహిళాలోకం', 'వేషము మార్చెనూ భాషను మార్చెను', 'సన్నగవీచే చల్లగాలికి', 'అలిగిన వేళనే చూడాలి' వంటి అద్భుతమైన పాటలు తెలుగు ప్రేక్షకుల హృదయాలలో నేటికీ చిరస్థాయిగా నిలిచిపోయాయి.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# హిమగిరి శిఖరాలపై మానవతా మహాయజ్ఞం

- చార్‌ధామ్ యాత్రికులకు సిద్ధిపేట వాసుల నిత్య అన్నదానం
- మంచుకొండల్లో తెలుగు సేవా పరిమళం
- వేల కిలోమీటర్ల దూరంలోనూ "అన్నదానం మహాదానం" ఆచరణ
- కేదార్‌నాథ్, చార్‌ధామ్ యాత్రికులకు ఉచిత భోజన వసతి
- చీకోటి మధుసూదన్, నందిని శ్రీనివాస్ నేతృత్వంలో సేవా యజ్ఞం



హిమాలయ పర్వత శ్రేణుల్లోని కేదార్‌నాథ్, బద్రీనాథ్, గంగోత్రి, యమునోత్రి క్షేత్రాలకు ప్రతి ఏటా లక్షలాది మంది భక్తులు తరలివస్తుంటారు. మంచు పర్వతాలు, ఆక్సిజన్ కొరత, క్లిష్టమైన మార్గాలు, తీవ్ర చలితో కూడిన ఈ యాత్రలో భక్తులకు ఎదురయ్యే ప్రధాన సమస్యల్లో ఆహారం ఒకటి. అలాంటి పరిస్థితుల్లో తెలంగాణలోని సిద్ధిపేట ప్రాంతానికి చెందిన సేవాభావం గల దాతలు, స్వచ్ఛంద సేవకులు హిమాలయాల్లో మానవతా దీపం వెలిగిస్తున్నారు.

### హిమాలయాల్లో అన్నపూర్ణ సేవ

సిద్ధిపేటకు చెందిన కేదార్‌నాథ్ అన్నదాన సేవా సమితి, అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో చార్‌ధామ్ యాత్రికులకు ప్రతిరోజూ ఉచితంగా భోజనం అందిస్తున్నారు. సమితుల చైర్మన్ చీకోటి మధుసూదన్, కార్యదర్శి నందిని శ్రీనివాస్ నాయకత్వంలో కొనసాగుతున్న ఈ సేవ వేలాది మంది భక్తులకు వరంగా మారింది. తెలంగాణ నుంచి వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న హిమాలయ ప్రాంతాలకు బియ్యం, పప్పులు, కూరగాయలు, వంట సామగ్రి, గ్యాస్ సిలిండర్లను తరలించి యాత్రికులకు వేడివేడిగా భోజనం అందించడం వెనుక ఉన్న కృషి అపారమని నిర్వాహకులు చెబుతున్నారు.

### గౌరీకుండ్ నుంచి కేదార్‌నాథ్ వరకు..

హరిద్వార్, రిషికేశ్ వరకు లారీల ద్వారా చేరిన సరుకును అక్కడి నుంచి చిన్న వాహనాల ద్వారా గౌరీకుండ్‌కు తరలిస్తారు. అనంతరం కేదార్‌నాథ్‌కు వెళ్లే కొండ మార్గంలో గుర్రాలు, పోర్టర్ల సాయంతో సామగ్రిని పైకి చేర్చాల్సి ఉంటుంది. రవాణా వ్యయం భారీగా పెరిగినా సేవలో ఎక్కడా వెనుకడుగు వేయడం లేదని నిర్వాహకులు పేర్కొంటున్నారు.

### భక్తుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మెనూ

తీవ్ర చలి పరిస్థితుల్లో యాత్రికులకు వేడి అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు అందిస్తున్నారు. అన్నం, పప్పు, కూరలు, సాంబారు, పెరుగు, టీ, కాఫీ వంటి ఆహార పదార్థాలను పరిశుభ్రంగా తయారు చేసి వడ్డిస్తున్నారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులకు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. ఈ మహాయజ్ఞం వెనుక సిద్ధిపేట ప్రజల సహకారం కీలకంగా నిలుస్తోంది. కొందరు ధనసహాయం చేస్తే, మరికొందరు బియ్యం, పప్పులు, ఇతర నిత్యావసర వస్తువులను అందిస్తున్నారు. యువత స్వచ్ఛందంగా ఉత్తరాఖండ్ చేరుకుని వంట, వడ్డన, శుభ్రత పనుల్లో పాల్గొంటున్నారు.

### జాతీయ సమైక్యతకు ప్రతీక

తెలంగాణ గడ్డపై ప్రారంభమైన ఈ సేవా కార్యక్రమం హిమాలయాల వరకు విస్తరించి దేశ సమైక్యతకు ప్రతీకగా నిలుస్తోంది. భాష, ప్రాంతం, కులం, మతం అనే తేడా లేకుండా ప్రతి యాత్రికుడికి సమానంగా అన్నదానం చేయడం ద్వారా "వసుధైవ కుటుంబకం" భావనను ఆచరణలో చూపిస్తున్నారు.

### మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం

హిమగిరి శిఖరాలపై గడ్డకట్టే చలిలోనూ నిరంతరాయంగా కొనసాగుతున్న ఈ అన్నదాన సేవ భక్తులకు ఆకలి తీర్చడమే కాకుండా మానవత్వం ఇంకా సజీవంగా ఉందని చాటుతోంది. సిద్ధిపేట వాసులు నిర్వహిస్తున్న ఈ సేవా యజ్ఞం తెలంగాణకు గర్వకారణంగా నిలుస్తోంది.



చురకలు





# బంగారం ధరలకు బ్రేక్

**హైదరాబాద్, జూన్ 8 :** గత వారం నుంచి కొనసాగుతున్న బంగారం ధరల తగ్గుదల ఈ వారం ఆరంభంలోనూ కొనసాగింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలు బలహీనపడటంతో దేశీయ మార్కెట్‌లోనూ పసిడి ధరలు తగ్గుముఖం పట్టాయి. సోమవారం ఉదయం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,51,690కు చేరగా, క్రితం ముగింపు ధరతో పోలిస్తే రూ.1,040 మేర తగ్గింది. అదే సమయంలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.950 తగ్గి రూ.1,39,050 వద్ద నమోదైంది. బంగారం ధరలు తగ్గినా వెండి ధరల్లో మాత్రం ఎలాంటి మార్పు కనిపించలేదు. హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ.2.70 లక్షల వద్ద స్థిరంగా కొనసాగుతోంది. విజయవాడ మార్కెట్‌లో కూడా దాదాపు ఇదే స్థాయి ధరలు నమోదవుతున్నాయి. ఇటీవల వరుసగా పెరిగిన పసిడి ధరలు సామాన్య కొనుగోలుదారులను ఆందోళనకు గురి చేయగా, తాజా తగ్గుదలతో నగల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్న వారిలో కొంత ఊరట కనిపిస్తోంది. దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో కూడా బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,53,490గా ఉండగా, 22 క్యారెట్ల బంగారం రూ.1,40,700 వద్ద కొనసాగుతోంది. ముంబైలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,51,690 కాగా, 22 క్యారెట్ల బంగారం రూ.1,39,050 వద్ద నమోదైంది. దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,51,840గా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,39,200గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్ బలపడటం, పెట్టుబడిదారులు ఇతర ఆస్తుల వైపు మొగ్గు చూపడం వంటి కారణాల వల్ల బంగారం ధరల్లో ఈ తగ్గుదల కనిపిస్తోందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అయితే ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, అంతర్జాతీయ ఉద్రిక్తతలు, కేంద్ర బ్యాంకుల వడ్డీ రేట్ల నిర్ణయాలు వంటి అంశాలు రానున్న రోజుల్లో పసిడి ధరల దిశను నిర్ణయించే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం వివిధ నగరాల్లో కిలో వెండి ధర రూ.2.60 లక్షల నుంచి రూ.2.70 లక్షల మధ్య కొనసాగుతోంది.

# గ్యాస్ ధరల పెంపు అనివార్యం

## కేంద్ర మంత్రి వివరణ



**ధార్వాడ్, జూన్ 8 :** ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అసాధారణ పరిస్థితులు, అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌లో ఏర్పడిన సంక్షోభాల కారణంగానే వంట గ్యాస్ ధరలను పెంచాల్సి వచ్చిందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. కర్ణాటకలోని ధార్వాడ్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, గ్యాస్ ధరల పెంపు పట్ల కేంద్ర ప్రభుత్వం కూడా బాధపడుతోందని, అయితే అంతర్జాతీయ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని చెప్పారు. ప్రస్తుతం ఎల్‌పీజీ సరఫరా పరిమిత వనరులపైనే ఆధారపడుతోందని ఆయన పేర్కొన్నారు. దేశీయ అవసరాలను తీర్చేందుకు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం సుదూర దేశాల నుంచి కూడా గ్యాస్‌ను దిగుమతి చేసుకుంటోందన్నారు. దీంతో రవాణా ఖర్చులు, కొనుగోలు వ్యయం భారీగా పెరిగాయని వివరించారు. విదేశాల నుంచి గ్యాస్ రవాణాకు 40 నుంచి 45 రోజుల సమయం పడుతుండటంతో బీమా వ్యయాలు కూడా గణనీయంగా పెరిగాయని తెలిపారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం గృహ వినియోగ ఎల్‌పీజీ సిలిండర్ ధరపై మరో రూ.29 పెంపును ప్రకటించింది. గత మూడు నెలల వ్యవధిలో ఇది రెండోసారి ధరల పెంపు కావడం గమనార్హం. అంతకు ముందు మార్చి నెలలో కూడా ఒక్కో సిలిండర్‌పై రూ.60 పెంచారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు, గ్యాస్ ధరలు పెరగడం ఈ నిర్ణయాలకు ప్రధాన కారణమని ప్రభుత్వం చెబుతోంది. ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలు ఒక్కో ఎల్‌పీజీ సిలిండర్‌పై సుమారు రూ.703 వరకు నష్టాన్ని భరిస్తున్నాయని కేంద్రం వెల్లడించింది. ఒక సిలిండర్‌ను వినియోగదారుల ఇంటి వద్దకు చేరవేయడానికి ప్రభుత్వానికి రూ.1,600కు పైగా ఖర్చవుతోందని పేర్కొంది. గల్ఫ్ ప్రాంతానికి కీలకమైన హర్మూజ్ జలసంధి వద్ద ఏర్పడిన అంతరాయాల కారణంగా సరఫరా ప్రభావితమైందని, ఫిబ్రవరి నుంచి గ్యాస్ ప్రామాణిక ధరలు దాదాపు 46 శాతం పెరిగాయని వివరించింది. అయితే అంతర్జాతీయంగా ధరలు పెరిగినప్పటికీ, భారత్‌లో వంట గ్యాస్ ధరలు ఇప్పటికీ పొరుగు దేశాలతో పోలిస్తే తక్కువగానే ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. పాకిస్థాన్, నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక వంటి దేశాలతో పోలి స్తే భారత వినియోగదారులు తక్కువ ధరకే ఎల్‌పీజీ సిలిండర్ పొందు తున్నారని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. దీంతో సామాన్యులపై భారం తగ్గించే దిశగా ప్రభుత్వం చర్యలు కొనసాగిస్తూనే, సరఫరాలో అంతరాయం లేకుండా చూడటానికి ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.

# ఉద్యోగులకు డీఏ ఊరట.. పలు రాష్ట్రాల్లో పెంపు





**న్యూఢిల్లీ, జూన్ 8 :** దేశవ్యాప్తంగా పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిత్యావసర వస్తువుల ధరల నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, బ్యాంకు సిబ్బందికి కరువు భత్యం పెంపు రూపంలో ఊరట లభిస్తోంది. అఖిల భారత వినియోగదారుల ధరల సూచీ ఆధారంగా పలు రాష్ట్ర ప్రభుత్వాలు డీఏ, డీఆర్ పెంపులను ప్రకటించగా, పెండింగ్‌లో ఉన్న బకాయిల చెల్లింపుల ప్రక్రియ కూడా వేగవంతమవుతోంది. అస్సాం ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్లకు కరువు భత్యం మరియు కరువు ఉపశమనాన్ని మరో 2 శాతం పెంచింది. దీంతో మొత్తం డీఏ 60 శాతానికి చేరుకుంది. ఈ నిర్ణయం వల్ల సుమారు 8 లక్షల మందికి పైగా లబ్ధి చేకూరనుంది. పెరిగిన భత్యం జూలై 5 నుంచి అమల్లోకి రానుంది. బీహార్ ప్రభుత్వం వివిధ వేతన సంఘాల పరిధిలో ఉన్న ఉద్యోగులకు 5 శాతం నుంచి 9 శాతం వరకు డీఏ పెంపును ప్రకటించింది. అదే విధంగా ఒడిశా ప్రభుత్వం ఉద్యోగులకు 2 శాతం డీఏ పెంచి, ఆ మొత్తాన్ని మే నెల జీతాలు, పెన్షన్లతో కలిపి ఖాతాల్లో జమ చేసింది. పలు రాష్ట్రాల్లో పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిల చెల్లింపులపై కూడా చర్యలు ప్రారంభమయ్యాయి. మహారాష్ట్ర ప్రభుత్వం 5వ, 6వ, 7వ వేతన సంఘాల పరిధిలోని ఉద్యోగులకు గత నవంబర్, డిసెంబర్, జనవరి నెలలకు సంబంధించిన సుమారు రూ.800 కోట్ల డీఏ బకాయిల విడుదలకు ఆమోదం తెలిపింది. పంజాబ్ ప్రభుత్వం 2021 జూలై నుంచి 2024 మార్చి వరకు పేరుకుపోయిన డీఏ బకాయిల చెల్లింపుల అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చింది. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం డీఏ బకాయిల అంశంపై సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేస్తామని ప్రకటించింది. కర్ణాటకలో రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగ సంఘాలు జీతాల పెంపుతో పాటు 38 నెలల డీఏ బకాయిలను ఒకే విడతలో చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ అంశంపై ఆందోళన కార్యక్రమాలకు కూడా సిద్ధమవుతున్నట్లు సమాచారం.

ఇక బ్యాంకింగ్ రంగంలో కూడా ఉద్యోగులకు ఊరట లభించింది. భారతీయ బ్యాంకుల సంఘం మే, జూన్, జూలై నెలలకు సంబంధించిన సవరించిన కరువు భత్యం రేట్లను ప్రకటించింది. ఈ కొత్త రేట్లు అన్ని స్థాయిల బ్యాంకు ఉద్యోగులు, అధికారులకు వర్తించనున్నాయి. ప్రస్తుతం పాలు, కూరగాయలు, ఇంధన ధరలు పెరుగుతున్న నేపథ్యంలో రానున్న జూలై నెలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మరో 2 నుంచి 3 శాతం వరకు అదనపు డీఏ పెంపు లభించే అవకాశముందని ఉద్యోగ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

# మారుతి కొత్త ఎస్‌యూవీల దండు





**న్యూఢిల్లీ, జూన్ 8 :** మారుతి సుజుకీ దేశీయ మార్కెట్లో మారుతున్న వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా తన వ్యూహాన్ని మార్చుకుంటోంది. 'విజన్ 3.0' ప్రణాళికలో భాగంగా ఎస్‌యూవీ విభాగంపై ప్రత్యేక దృష్టి సారించిన సంస్థ, రాబోయే సంవత్సరాల్లో తన మోడళ్ల సంఖ్యను 19 నుంచి 29కు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాలు, పెద్ద కుటుంబాలను ఆకర్షించేలా కొత్త హైబ్రిడ్ సాంకేతికతతో కూడిన వాహనాలను తీసుకురావడానికి సిద్ధమవుతోంది. ఈ జాబితాలో అత్యంత ఆసక్తిని రేకెత్తిస్తున్న మోడల్ ఫ్రాంక్స్ ఫేస్‌లిఫ్ట్. ఇందులో కొత్త తరం స్ట్రాంగ్ హైబ్రిడ్ ఇంజిన్‌ను అందించే అవకాశం ఉంది. ఈ సాంకేతికతతో లీటరు పెట్రోలుకు సుమారు 35 కిలోమీటర్ల వరకు మైలేజీ లభించవచ్చని అంచనాలు వ్యక్తమవుతున్నాయి. పెరుగుతున్న ఇంధన ధరల నేపథ్యంలో ఈ కారు మధ్యతరగతి వినియోగదారులకు ఆకర్షణీయ ఎంపికగా మారే అవకాశం ఉంది. ఇప్పటికే మార్కెట్లో మంచి ఆదరణ పొందుతున్న గ్రాండ్ విటారాను కూడా కొత్త రూపంలో తీసుకురానున్నారు. ప్రస్తుతం ఉన్న ఐదు సీట్ల మోడల్‌కు తోడు మూడు వరుసల సీట్లతో కూడిన ఏడు సీట్ల వెర్షన్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఎక్కువ మంది కుటుంబ సభ్యులతో ప్రయాణించే వారికి అనువుగా ఈ వాహనం రూపొందనుంది. విశాలమైన అంతర్గత స్థలం, అధిక బూట్ స్పేస్‌తో ఈ మోడల్ పెద్ద ఎస్‌యూవీ విభాగంలో గట్టి పోటీ ఇవ్వనుందని భావిస్తున్నారు. మారుతి బ్రెజ్జా కూడా కొత్త అవతారంలో రానుంది. ఫేస్‌లిఫ్ట్ వెర్షన్‌లో 1.0 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్‌ను తిరిగి ప్రవేశపెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. పెద్ద ఇన్ఫోటైన్‌మెంట్ స్క్రీన్, అధునాతన భద్రతా సదుపాయాలు, ఆధునిక డ్రైవర్ సహాయక వ్యవస్థలతో ఈ మోడల్‌ను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దనున్నారు. అదే సమయంలో గ్రాండ్ విటారా ఐదు సీట్ల వెర్షన్‌ను కూడా కొత్త డిజైన్, అదనపు ఫీచర్లతో మార్కెట్లోకి మళ్లీ తీసుకురావాలని సంస్థ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. మైలేజీ, సాంకేతికత, భద్రత, సౌకర్యాల కలయికతో కొత్త తరం వాహనాలను అందించడంపై మారుతి ప్రత్యేక దృష్టి పెట్టింది. భారత ఆటోమొబైల్ మార్కెట్లో ఎస్‌యూవీలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని సంస్థ చేపడుతున్న ఈ మార్పులు భవిష్యత్తులో కీలక ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయి. తక్కువ నిర్వహణ ఖర్చుతో అధిక మైలేజీ కోరుకునే వినియోగదారులకు ఈ కొత్త మోడళ్లు ఆకర్షణీయ ఎంపికలుగా మారనున్నాయి.

# దీర్ఘకాలిక పెట్టుబడులపై ఎల్ఐసీ దృష్టి






**న్యూఢిల్లీ, జూన్ 8 :** భారతీయ జీవిత బీమా కార్పొరేషన్ దీర్ఘకాలిక పెట్టుబడి సాధనాల కోసం అన్వేషణను ముమ్మరం చేసింది. ముఖ్యంగా యాన్యుటీ పాలసీలకు సంబంధించిన భవిష్యత్ చెల్లింపులను దృష్టిలో ఉంచుకుని, మరిన్ని దీర్ఘకాలిక పెట్టుబడి అవకాశాలు అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉందని సంస్థ భావిస్తోంది. ఎల్ఐసీ సీఈఓ, ఎండీ ఆర్ దొరైస్వామి మాట్లాడుతూ, దీర్ఘకాలిక పెట్టుబడి సాధనాల అభివృద్ధి కోసం భారతీయ రిజర్వ్ బ్యాంక్, భారతీయ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు, బీమా నియంత్రణ మరియు అభివృద్ధి ప్రాధికార సంస్థలతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఎక్కువ మంది పాలసీదారులు యాన్యుటీ పాలసీల వైపు మొగ్గు చూపుతున్నారని, వాటి కింద 30 నుంచి 40 ఏళ్ల వరకు చెల్లింపులు కొనసాగించాల్సి ఉంటుందని ఆయన వివరించారు. అందువల్ల ఆ బాధ్యతలకు అనుగుణంగా సుదీర్ఘ కాలానికి స్థిరమైన రాబడులు అందించే పెట్టుబడి సాధనాలు అవసరమని పేర్కొన్నారు. మారుతున్న మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా కొత్త పెట్టుబడి అవకాశాలను గుర్తించేందుకు ఐఆర్‌డీఏఐ కూడా కసరత్తు చేస్తోందని దొరైస్వామి వెల్లడించారు. భవిష్యత్తులో బీమా రంగ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పెట్టుబడి విధానాల్లో మార్పులు చోటు చేసుకునే అవకాశముందని తెలిపారు. మరోవైపు ఆర్థిక సాంకేతిక రంగంలో అడుగుపెట్టే అవకాశాలను కూడా ఎల్ఐసీ పరిశీలిస్తోంది. ఇందుకోసం ప్రత్యేక ఫిన్‌టెక్ సంస్థను ఏర్పాటు చేయాలా లేదా ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఫిన్‌టెక్ కంపెనీలో భాగస్వామ్యం పొందాలా అనే అంశంపై అధ్యయనం కొనసాగుతోందని దొరైస్వామి చెప్పారు. ఎల్ఐసీ వాటాల్లో మరింత విక్రయం విషయంలో తుది నిర్ణయం కేంద్ర ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. తొలి ప్రజా వాటాల విక్రయం సమయంలోనే సంస్థ ఇందుకు సిద్ధంగా ఉందని, భవిష్యత్తులో ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు అనుగుణంగా ముందుకు సాగుతామని తెలిపారు.

# ఇన్నింగ్స్ తేడాతో భారత్ విజయం

**న్యూ చండీగఢ్, జూన్ 8 :** ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన ఏకైక టెస్టులో భారత్ పూర్తి ఆధిపత్యం చాటుతూ ఇన్నింగ్స్ 300 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. ముల్లాన్‌పూర్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో అద్భుత ప్రదర్శన చేసిన టీమిండియా మూడు రోజుల్లోనే మ్యాచ్‌ను ముగించింది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 8 వికెట్ల నష్టానికి 564 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సెంచరీతో రాణించగా, కేఎల్ రాహుల్ కూడా శతకం బాదాడు. సాయి సుదర్శన్, రిషభ్ పంత్, వాషింగ్టన్ సుందర్ అర్ధశతకాలతో జట్టుకు భారీ స్కోరు అందించారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆఫ్ఘనిస్థాన్ భారత బౌలర్ల ధాటికి 152 పరుగులకే కుప్పకూలింది. అరంగేట్ర మ్యాచ్ ఆడిన మానవ్ సుతార్ ఆరు వికెట్లు తీసి ప్రత్యర్థి బ్యాటింగ్‌ను చీల్చిచెండాడాడు. దీంతో 412 పరుగుల వెనుకబాటులో ఉన్న ఆఫ్ఘన్ జట్టును భారత్ ఫాలోఆన్ ఆడమని ఆహ్వానించింది. రెండో ఇన్నింగ్స్‌లోనూ ఆఫ్ఘనిస్థాన్ పరిస్థితి మారలేదు. ఓపెనర్ అటల్ 42 పరుగులు, గుర్బాజ్ 24 పరుగులు చేసినా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. స్పిన్‌కు అనుకూలించిన పిచ్‌పై భారత స్పిన్నర్లు మరోసారి చెలరేగడంతో ఆఫ్ఘన్ జట్టు 35.3 ఓవర్లలో 112 పరుగులకే ఆలౌట్ అయింది. మూడో రోజు ఆటలో వాషింగ్టన్ సుందర్ నాలుగు వికెట్లు, కుల్దీప్ యాదవ్ మూడు వికెట్లు తీసి విజయాన్ని ఖాయం చేశారు. మ్యాచ్ మొత్తంలో భారత బౌలర్ల క్రమశిక్షణతో కూడిన ప్రదర్శన ఆఫ్ఘనిస్థాన్‌కు ఏ దశలోనూ అవకాశమివ్వలేదు. ఈ విజయంతో టెస్టు సిరీస్‌ను భారత్ విజయవంతంగా ముగించగా, యువ ఆటగాడు మానవ్ సుతార్ తన అరంగేట్ర మ్యాచ్‌లోనే ఆకట్టుకునే ప్రదర్శనతో అందరి ప్రశంసలు అందుకున్నాడు.






# ప్రపంచ చెస్ విజేత ప్రజ్ఞానంద్‌కు సత్కారం

## చెస్ ఆడి అభినందించిన సీఎం విజయ్

**చెన్నై, జూన్ 8:** అంతర్జాతీయ చెస్ ప్రపంచంలో చరిత్ర సృష్టించిన భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద్‌కు తమిళనాడు ప్రభుత్వం ఘన సత్కారం అందించింది. నార్వే రాజధాని ఓస్లోలో నిర్వహించిన నార్వే చెస్ రెండువేల ఇరవై ఆరు పోటీల్లో విజేతగా నిలిచి అరుదైన ఘనత సాధించిన ప్రజ్ఞానంద్‌ను ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ సచివాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు యాభై లక్షల రూపాయల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. నార్వే చెస్ చరిత్రలో విజేతగా నిలిచిన తొలి భారతీయుడిగా ప్రజ్ఞానంద్ కొత్త రికార్డు నెలకొల్పారు. ప్రపంచ అగ్రశ్రేణి క్రీడాకారులతో పోటీపడి ఈ ఘనత సాధించడం భారత చెస్ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచింది. యువ వయసులోనే అంతర్జాతీయ స్థాయిలో వరుస విజయాలు సాధిస్తూ ప్రజ్ఞానంద్ దేశానికి గర్వకారణంగా మారారు. ఈ విజయాన్ని గుర్తిస్తూ ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచే యువతకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రపంచ వేదికలపై భారత జెండాను రెపరెపలాడించిన క్రీడాకారులను ప్రోత్సహించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. సత్కార కార్యక్రమం అనంతరం ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్, ప్రజ్ఞానంద్‌తో కలిసి చెస్ ఆడడం విశేష ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా చెస్ క్రీడ ప్రాముఖ్యత, యువతలో మేధో వికాసానికి దోహదపడే అంశాలపై వారు చర్చించినట్లు అధికారులు తెలిపారు. ప్రజ్ఞానంద్ సాధించిన విజయం దేశవ్యాప్తంగా చెస్ అభిమానులను ఆనందంలో ముంచెత్తింది. ప్రపంచ స్థాయి పోటీల్లో భారత క్రీడాకారులు మరింత ప్రతిభ కనబరుస్తున్న తరుణంలో ఈ విజయం ప్రత్యేక గుర్తింపు పొందింది. చెస్ రంగంలో భారతదేశానికి మరిన్ని విజయాలు తీసుకురావాలని ప్రజ్ఞానంద్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. తమిళనాడు ప్రభుత్వం అందించిన ఈ సత్కారం యువ క్రీడాకారులకు ప్రేరణగా నిలుస్తుందని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ప్రతిభకు గుర్తింపు లభిస్తే మరిన్ని యువత అంతర్జాతీయ వేదికలపై రాణించే అవకాశాలు పెరుగుతాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# ముంబైకి సూర్య గుడ్‌బై?

## సోషల్ మీడియాలో జోరుగా చర్చ

**ముంబై, జూన్ 8 :** భారత స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ భవిష్యత్తుపై క్రికెట్ వర్గాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. ఐపీఎల్‌లో తాను ఎన్నేళ్లుగా ప్రాతినిధ్యం వహిస్తున్న ముంబై ఇండియన్స్ జట్టుతో ఆయన బంధం ముగియబోతుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సూర్యకుమార్ యాదవ్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ముంబై ఇండియన్స్‌కు సంబంధించిన పలు పోస్టులను తొలగించడంతో పాటు జట్టు అధికారిక ఖాతా, కెప్టెన్ హార్దిక్ పాండ్యా ఖాతాలను అన్‌ఫాలో చేసినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఆయన ప్రొఫైల్‌లో రోహిత్ శర్మ, ఎంఎస్ ధోనీతో ఉన్న పాత ఫొటో మాత్రమే కనిపిస్తుండటంతో ఊహాగానాలు మరింత పెరిగాయి. 2018లో కోల్‌కతా జట్టు నుంచి ముంబై ఇండియన్స్‌లో చేరిన సూర్యకుమార్ యాదవ్ అనేక మ్యాచ్‌ల్లో జట్టుకు విజయాలు అందించాడు. అయితే ఐపీఎల్ 2026 సీజన్‌లో ఆయన ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. 10 మ్యాచ్‌ల్లో 270



పరుగులు మాత్రమే చేయడంతో విమర్శలు ఎదుర్కొన్నాడు. ఈ నేపథ్యంలో వచ్చే మెగా వేలానికి ముందు ముంబై యాజమాన్యం కొత్త వ్యూహాలపై దృష్టి పెట్టిందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా, సూర్యకుమార్‌కు మద్దతుగా భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ స్పందించాడు. సూర్య ఫామ్ ఆశించిన స్థాయిలో లేకపోయినా, అతను జట్టుకు అందించిన సేవలను విస్మరించరాదని అభిప్రాయపడ్డాడు. ముఖ్యంగా టీ20 ప్రపంచకప్ విజయంలో కెప్టెన్‌గా అతని పాత్రను గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నాడు. సూర్యకుమార్ యాదవ్ భవిష్యత్తుపై అధికారిక ప్రకటన ఏదీ వెలువడకపోయినా, సోషల్ మీడియాలో జరుగుతున్న పరిణామాలు అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ముంబై ఇండియన్స్‌తో ఆయన ప్రయాణం కొనసాగుతుందా లేదా కొత్త జట్టులో కనిపిస్తాడా అన్నది రాబోయే రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# జై షా కరచాలనంపై సోషల్ మీడియాలో చర్చ



**లండన్, జూన్ 8 :** మహిళల టీ20 ప్రపంచకప్ ప్రారంభానికి ముందు జరిగిన ఓ కార్యక్రమంలో జై షా, పాకిస్థాన్ మహిళల జట్టు కెప్టెన్ ఫాతిమా సనా మధ్య జరిగిన కరచాలనం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ఇంగ్లండ్‌లో నిర్వహించిన కెప్టెన్ల సమావేశంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ దృశ్యాలు వైరల్ కావడంతో భారత్, పాకిస్థాన్ అభిమానుల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు దీనిని క్రీడా స్ఫూర్తికి నిదర్శనంగా అభివర్ణిస్తుండగా, మరికొందరు గతంలో భారత్ అనుసరించిన విధానాలను ప్రస్తావిస్తూ విమర్శలు గుప్పిస్తున్నారు. భారత అభిమానుల వాదన ప్రకారం, జై షా ప్రస్తుతం ఛైర్మన్ హోదాలో ఉన్నారు. ఆ బాధ్యతల్లో భాగంగా అన్ని సభ్య దేశాల ప్రతినిధులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం సహజమని వారు అభిప్రాయపడుతున్నారు. అంతర్జాతీయ క్రీడా సంస్థకు నాయకత్వం వహిస్తున్న వ్యక్తిగా ఆయన ప్రవర్తనను రాజకీయ కోణంలో చూడకూడదని పేర్కొంటున్నారు. మరోవైపు పాకిస్థాన్ అభిమానులు గతంలో భారత్--పాకిస్థాన్ ద్వైపాక్షిక క్రికెట్ సంబంధాల సమయంలో చోటుచేసుకున్న పరిణామాలను గుర్తు చేస్తూ చర్చను ముందుకు తీసుకెళున్నారు. దీంతో ఈ అంశం సోషల్ మీడియా వేదికల్లో విస్తృతంగా చర్చకు దారితీసింది. ఇదిలా ఉండగా, మహిళల టీ20 ప్రపంచకప్ జూన్ 12న ఇంగ్లండ్ మహిళల క్రికెట్ జట్టు మరియు శ్రీలంక మహిళల క్రికెట్ జట్టు మధ్య జరిగే మ్యాచ్‌తో ప్రారంభం కానుంది. టోర్నమెంట్‌లో అత్యంత ఆసక్తికర పోరుగా భావిస్తున్న భారత్-పాకిస్థాన్ మహిళల టీ20 ప్రపంచకప్ మ్యాచ్ జూన్ 14న బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో జరగనుంది. ఈ మ్యాచ్ కోసం ఇప్పటికే అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న న్యూజిలాండ్ మహిళల క్రికెట్ జట్టు మరోసారి టైటిల్ నిలబెట్టుకోవాలనే లక్ష్యంతో పోటీలోకి అడుగుపెడుతోంది. టోర్నమెంట్ ప్రారంభానికి ముందే జై షా కరచాలనం అంశం చర్చనీయాంశంగా మారడం విశేషం.

# సుతార్ సంచలనం

## ఫాలోఆన్‌లో ఆఫ్ఘాన్

**న్యూ చండీగఢ్, జూన్ 8 :** ఆఫ్ఘనిస్థాన్‌తో జరుగుతున్న ఏకైక టెస్టులో భారత జట్టు పూర్తి ఆధిపత్యం చెలాయిస్తోంది. ముల్లాన్‌పూర్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో ఆఫ్ఘనిస్థాన్ కేవలం 152 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో 412 పరుగుల భారీ ఆధిక్యం సాధించిన భారత్ ప్రత్యర్థిని ఫాలోఆన్ ఆడమని ఆహ్వానించింది. భారత బౌలర్ల ధాటికి ఆఫ్ఘన్ బ్యాటర్లు నిలవలేకపోయారు. ముఖ్యంగా అరంగేట్ర మ్యాచ్ ఆడుతున్న మానవ్ సుతార్ అద్భుత ప్రదర్శనతో చెలరేగి ఆరు వికెట్లు పడగొట్టాడు. అతని కచ్చితమైన బౌలింగ్‌కు ఆఫ్ఘన్ బ్యాటింగ్ కుప్పకూలింది. ప్రసిద్ధ్ కృష్ణ మూడు వికెట్లు సాధించగా, వాషింగ్టన్ సుందర్ ఒక వికెట్ తన ఖాతాలో వేసుకున్నాడు. ఆఫ్ఘనిస్థాన్ తరఫున రహ్మత్ షా మాత్రమే పోరాడుతూ 60 పరుగులు చేశాడు. మిగిలిన బ్యాటర్లు భారత బౌలర్లను ఎదుర్కొనేందుకు ఇబ్బంది పడ్డారు. 58.4 ఓవర్లలోనే ఆ జట్టు తొలి ఇన్నింగ్స్ ముగిసింది. అంతకుముందు భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 8 వికెట్ల నష్టానికి 564 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 126 పరుగులతో సెంచరీ సాధించగా, కేఎల్ రాహుల్ 100 పరుగులతో ఆకట్టుకున్నాడు. సాయి సుదర్శన్ 81, రిషభ్ పంత్ 81, వాషింగ్టన్ సుందర్ 52 పరుగులతో జట్టుకు భారీ స్కోరు అందించారు. ఆఫ్ఘనిస్థాన్ బౌలర్లలో సలీమ్ సాఫి ఆరు వికెట్లతో రాణించాడు. రెహమాన్ షరీఫీ, హష్మతుల్లా షాహిదీ తలో వికెట్ సాధించారు. యశస్వి జైస్వాల్ మాత్రం 24 పరుగులకే ఔటై నిరాశపరిచాడు. ఫాలోఆన్‌లో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆఫ్ఘనిస్థాన్ నాలుగు ఓవర్ల ముగిసే సమయానికి వికెట్ల నష్టం లేకుండా 18 పరుగులు చేసింది. భారత్ విజయానికి ఇంకా పది వికెట్లు మాత్రమే దూరంలో ఉండగా, మ్యాచ్‌పై పూర్తిస్థాయి పట్టు సాధించింది.




# రిటైర్మెంట్ ప్రశ్నకు హర్మన్‌ప్రీత్ అదిరే కౌంటర్

**లండన్, జూన్ 8 :** భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ చేసిన సరదా వ్యాఖ్యలు ప్రస్తుతం క్రికెట్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. మహిళల టీ20 ప్రపంచకప్‌కు ముందు నిర్వహించిన మీడియా సమావేశంలో ఒక జర్నలిస్ట్ అడిగిన రిటైర్మెంట్ ప్రశ్నకు ఆమె ఇచ్చిన చురుకైన సమాధానం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రెస్ కాన్ఫరెన్స్ సందర్భంగా ఓ విలేకరి "ఇది మీ చివరి ప్రపంచకప్ అవుతుందా?" అని ప్రశ్నించగా, హర్మన్‌ప్రీత్ వెంటనే "ఎందుకు?" అంటూ ఎదురుప్రశ్నించింది. అనంతరం "నేను క్రికెట్ ఆపాలని మీరు అనుకుంటున్నారా?" అని సరదాగా ప్రశ్నించడంతో సమావేశంలో నవ్వులు పూశాయి. రిపోర్టర్ సమాధానం చెప్పేందుకు ప్రయత్నించగా, "అయితే ఈ ప్రశ్న ఎందుకు అడుగుతున్నారు?" అంటూ హర్మన్‌ప్రీత్ చమత్కారంగా స్పందించింది. ఈ ఘటనతో పలువురు అభిమానులు భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ 2016లో రిటైర్మెంట్ ప్రశ్నకు ఇచ్చిన ప్రసిద్ధ సమాధానాన్ని



గుర్తు చేసుకుంటున్నారు. ధోనీ మాదిరిగానే హర్మన్‌ప్రీత్ కూడా ప్రశాంతంగా, హాస్యంతో పరిస్థితిని చక్కదిద్దిందని సోషల్ మీడియాలో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా, మహిళల టీ20 ప్రపంచకప్ జూన్ 12 నుంచి ఇంగ్లాండ్, వేల్స్ వేదికగా ప్రారంభం కానుంది. ఈసారి 12 జట్లు టైటిల్ కోసం పోటీ పడనున్నాయి. భారత జట్టు ఉన్న గ్రూప్‌లో ఆస్ట్రేలియా మహిళల క్రికెట్ జట్టు, దక్షిణాఫ్రికా మహిళల క్రికెట్ జట్టు, బంగ్లాదేశ్ మహిళల క్రికెట్ జట్టు, నెదర్లాండ్స్ మహిళల క్రికెట్ జట్టు, పాకిస్థాన్ మహిళల క్రికెట్ జట్టు ఉన్నాయి. భారత్ తన తొలి మ్యాచ్‌లో జూన్ 14న పాకిస్థాన్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌పై ఇప్పటికే భారీ ఆసక్తి నెలకొంది. 2009లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన హర్మన్‌ప్రీత్ కౌర్ భారత మహిళల క్రికెట్‌లో అత్యంత విజయవంతమైన కెప్టెన్లలో ఒకరిగా నిలిచింది. ఆమె నాయకత్వంలో భారత జట్టు ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం, కామన్వెల్త్ క్రీడల్లో రజత పతకం సాధించడంతో పాటు ప్రపంచకప్ ఫైనల్‌కు కూడా చేరుకుంది. ఈసారి ప్రపంచకప్‌ను కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో భారత జట్టు బరిలోకి దిగుతోంది.



# పెద్ది వివాదంపై నిత్యామీనన్ స్పందన!


## ఆసక్తికర వ్యాఖ్యలు

రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కిన 'పెద్ది' చిత్రం విడుదలైన తర్వాత కథానాయిక పాత్రకు సంబంధించిన వివాదం ఇంకా చర్చనీయాంశంగానే కొనసాగుతోంది. సినిమాలో కథానాయికను మరింత ఆకర్షణీయంగా చూపించారంటూ సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వెల్లువెత్తడంతో ఈ అంశం పెద్ద చర్చకు దారి తీసింది. ఈ వివాదంపై ఇప్పటికే పలువురు సినీ ప్రముఖులు స్పందించగా, తాజాగా నటి నిత్యామీనన్ కూడా తన అభిప్రాయాన్ని వెల్లడించారు. కథానాయికలను కేవలం అందాల ప్రదర్శన కోణంలో చూపించడం ఒక్క తెలుగు చిత్ర పరిశ్రమకే పరిమితం కాదని, దాదాపు అన్ని చిత్ర పరిశ్రమల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోందని ఆమె పేర్కొన్నారు. ప్రేక్షకులను ఆకర్షించాలనే ఉద్దేశంతో కొందరు దర్శకులు, నిర్మాతలు అలాంటి విధానాన్ని అనుసరిస్తున్నారని చెప్పారు. చిత్రాలు మరింత వ్యాపారపరంగా మారుతున్న కొద్దీ కొన్ని సందర్భాల్లో హద్దులు దాటే పరిస్థితులు కూడా ఏర్పడుతున్నాయని అభిప్రాయపడ్డారు. అయితే ఈ విషయంలో కేవలం దర్శకులను మాత్రమే తప్పుబట్టడం సరైంది కాదని నిత్యామీనన్ అన్నారు. కొంతమంది కథానాయికలు అలాంటి పాత్రలను స్వీకరించడానికి సిద్ధంగా ఉండటంతో దర్శకులు కూడా వారిని అదే కోణంలో చూపిస్తుంటారని పేర్కొన్నారు. ఇది పూర్తిగా ఒకవైపు జరిగే విషయం కాదని స్పష్టం చేశారు. తన వ్యక్తిగత అనుభవాన్ని పంచుకుంటూ, గతంలో కొందరు దర్శకులు తనను పూర్తిగా అందాల ప్రదర్శనకు ప్రాధాన్యం ఉన్న పాత్రల కోసం సంప్రదించారని, అయితే అలాంటి పాత్రలు చేయడం ఇష్టం లేక తాను తిరస్కరించానని తెలిపారు. దాని వల్ల కొన్ని పెద్ద చిత్రాల్లో అవకాశాలు కోల్పోయినా ఎలాంటి బాధ లేదన్నారు. పేరు ప్రతిష్ఠల కంటే తన వ్యక్తిగత విలువలు, తాను నమ్మే సిద్ధాంతాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తానని చెప్పారు. పరిస్థితులు మన అభిరుచికి విరుద్ధంగా ఉన్నప్పుడు 'వద్దు' అని చెప్పగల ధైర్యం ఉండాలని నిత్యామీనన్ సూచించారు. కొంతమంది కథానాయికలు పెద్ద అవకాశాల కోసం ప్రాధాన్యం తక్కువగా ఉన్న పాత్రలను కూడా అం౦ కరిస్తుంటారని పేర్కొన్నారు. చివరికి ఏ పాత్ర చేయాలి, ఏ పాత్ర చేయకూడదు అనేది ప్రతి కథానాయిక వ్యక్తిగత నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుందని ఆమె వ్యాఖ్యానించారు.

## బాలనటి నుంచి బాలీవుడ్ వరకు

# రోష్ని ప్రస్థానం

చిన్న వయసులోనే కెమెరా ముందుకు వచ్చి తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న నటి రోష్ని వాలియా ప్రస్తుతం బాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకునే దిశగా అడుగులు వేస్తోంది. వాణిజ్య ప్రకటనల ద్వారా వినోద రంగంలోకి ప్రవేశించిన ఆమె, అనంతరం టెలివిజన్ ధారావాహికలు, సినిమాలు, సామాజిక మాధ్యమాల ద్వారా విశేష ఆదరణ పొందింది. రోష్ని వాలియా తొలిసారిగా మై లక్ష్మీ తేరే ఆంగన్ కీ ధారావాహికతో టెలివిజన్ రంగంలోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత భారత్ కా వీర్ పుత్ర -- మహారాణా ప్రతాప్లో యువ అజబ్దే పాత్రలో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. భావోద్వేగాలను సహజంగా వ్యక్తపరుస్తూ చిన్న వయసులోనే ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. ఈ పాత్ర ఆమె నట జీవితంలో కీలక మలుపుగా నిలిచింది. తరువాత తారా ఫ్రమ్ సతారా ద్వారా మరోసారి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. యువత కలలు, కుటుంబ బంధాలు, నృత్యం నేపథ్యంగా సాగిన ఈ ధారావాహికలో ఆమె నటనకు మంచి స్పందన లభించింది. బాలనటిగా ప్రారంభమైన ఆమె ప్రయాణం క్రమంగా విభిన్న పాత్రలతో విస్తరించింది. సినీ రంగంలో రోష్ని తొలిసారిగా మై ఫ్రెండ్ గణేశా 4లో బాలనటిగా కనిపించింది. అనంతరం పలు చిత్రాల్లో నటిస్తూ వెండితెరపై తన స్థానాన్ని బలపరుచుకుంది. ఇటీవల అజయ్ దేవగన్, మృణాల్ ఠాకూర్ ప్రధాన పాత్రల్లో నటించిన సన్ ఆఫ్ సర్దార్ 2లో రోష్ని కీలక పాత్ర పోషించింది. ఈ చిత్రం ఆమె కెరీర్‌లో మరో ముఖ్యమైన అడుగుగా నిలిచిందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. టెలివిజన్ నుంచి బాలీవుడ్ వరకు తన ప్రతిభను నిరూపించుకుంటూ వచ్చిన రోష్ని వాలియా, యువతలో మంచి అభిమాన వర్గాన్ని సంపాదించుకుంది. సామాజిక మాధ్యమాల్లోనూ ఆమెకు లక్షలాది మంది అనుచరులు ఉన్నారు. ఫ్యాషన్, గ్లామర్, చిత్రీకరణ విశేషాలు, వ్యక్తిగత క్షణాలను అభిమానులతో పంచుకుంటూ నిరంతరం వారితో అనుసంధానంగా ఉంటోంది. భవిష్యత్తులో మరిన్ని పెద్ద చిత్రాల్లో అవకాశాలు అందుకునే నటీమణుల్లో రోష్ని వాలియా పేరు ప్రముఖంగా వినిపిస్తోంది.



# 'రామాయణం'లో కాజల్ పాత్ర ఖరారు



దర్శకుడు నితేష్ తివారీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్న 'రామాయణం' చిత్రంలో తాను నటిస్తున్నట్లు ప్రముఖ నటి కాజల్ అగర్వాల్ అధికారికంగా ధృవీకరించారు. గత కొంతకాలంగా వస్తున్న ప్రచారాలకు తెరదించుతూ, ఈ భారీ చిత్రంలో తాను భాగమవుతున్నానని వెల్లడించారు. ఇటీవల జరిగిన ఓ అవార్డుల కార్యక్రమంలో మాట్లాడిన కాజల్ అగర్వాల్, ఈ సినిమా కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. భారతీయ సినీ చరిత్రలో ఇప్పటివరకు చూడని స్థాయిలో అత్యాధునిక సాంకేతికతతో ఈ చిత్రం రూపొందుతోందని, తన కెరీర్‌లో ఇది ప్రత్యేకమైన మైలురాయిగా నిలుస్తుందని ఆమె పేర్కొన్నారు. ఈ చిత్రంలో రావణుడి భార్య మండోదరి పాత్రను కాజల్ అగర్వాల్ పోషించనున్నారు. రామాయణ గాథలో కీలకమైన పాత్రల్లో ఒకటైన మండోదరిని వెండితెరపై ఎలా ఆవిష్కరిస్తారన్న ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. ఇక ఈ భారీ చిత్రంలో శ్రీరాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్, సీత పాత్రలో సాయిపల్లవి, రావణుడి పాత్రలో యశ్ నటిస్తున్నారు. అలాగే హనుమంతుడి పాత్రను సన్నీ డియోల్ పోషిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేయాలని నిర్మాతలు నిర్ణయించారు. తొలి భాగాన్ని 2026 దీపావళి సందర్భంగా, రెండో భాగాన్ని 2027లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్రబృందం ప్రణాళిక సిద్ధం చేసినట్లు సమాచారం. భారతీయ ఇతిహాస గాథను ప్రపంచ స్థాయి నిర్మాణ విలువలతో తెరకెక్కిస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి.

## శారీలో మెరిసిన

# హెబ్బా పటేల్

## ఫొటోలు వైరల్.. అభిమానుల ప్రశంసలు

సినీ నటి హెబ్బా పటేల్ మరోసారి తన తాజా ఫొటోలతో సోషల్ మీడియాలో ఆకట్టుకున్నారు. ఎప్పుడూ సామాజిక మాధ్యమాల్లో చురుకుగా ఉండే హెబ్బా, ఈసారి సంప్రదాయ శారీలో కనిపిస్తూ అభిమానులను అలరించారు. శారీలో సొగసైన లుక్‌తో కెమెరాకు ఫోజులిచ్చిన ఆమె ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. సంప్రదాయ దుస్తుల్లోనూ తన ప్రత్యేక ఆకర్షణను చాటుకున్నారని అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ చిత్రాలను చూసిన అభిమానులు "సో క్యూట్", "అందంగా ఉన్నారు" అంటూ ప్రేమ గుర్తులతో కామెంట్లు పెడుతున్నారు. హెబ్బా తాజా ఫొటోలకు సామాజిక మాధ్యమాల్లో విశేష స్పందన లభిస్తోం



# బాలయ్య సినిమాకు రాజశేఖర్ విలన్?



నటసింహం బాలకృష్ణ, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ చిత్రంపై సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ఓ వార్త అభిమానుల్లో ఉత్సాహాన్ని పెంచుతోంది. ఈ చిత్రంలో బాలకృష్ణకు ప్రతినాయకుడిగా సీనియర్ నటుడు రాజశేఖర్ నటించే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. సినీ వర్గాల సమాచారం ప్రకారం, రాజశేఖర్ కోసం ప్రత్యేకంగా శక్తివంతమైన పాత్రను రూపొందించినట్లు తెలుస్తోంది. సాధారణ ప్రతినాయకుడి పాత్రకు భిన్నంగా, కథలో కీలక ప్రాధాన్యం కలిగిన పాత్రగా దీనిని మలిచినట్లు సమాచారం. బాలకృష్ణ పాత్రకు సమాన స్థాయిలో నిలిచేలా ఈ పాత్రను తీర్చిదిద్దుతున్నారని టాలీవుడ్‌లో చర్చ నడుస్తోంది. సామాజిక అంశాలను వాణిజ్య హంగులతో మేళవించి విజయవంతమైన చిత్రాలు తెరకెక్కించిన కొరటాల శివ, ఈసారి కూడా అదే తరహా కథను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. బాలకృష్ణకు ఉన్న మాస్ ఇమేజ్, శక్తివంతమైన సంభాషణలు, యాక్షన్ అంశాలు ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ఇక రాజశేఖర్ ఈ సినిమాలో నటిస్తే, ఆయన కెరీర్‌లో మరో విభిన్న పాత్రగా నిలిచే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గతంలో కథానాయకుడిగా ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆయన, ప్రతినాయక ఛాయలు ఉన్న పాత్రలో కనిపిస్తే తెరపై కొత్త అనుభూతిని అందించగలరని భావిస్తున్నారు. ఈ చిత్రానికి స్వ౦ తాన్ని అనిరుధ్ రవిచందర్ అందించే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. భారీ స్థాయి-౦లో రూపొందనున్న ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే రాజశేఖర్ పాత్రకు సంబంధించి చిత్ర బృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com